Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 339 మేడ్చల్ మల్కాజ్‌గిరి 28 డిసెంబర్ 2023 గురువారం పేజీలు : 4

## నిన్నటి వరకు కాలుష్యం.. ఇప్పుడు పొగమంచు

### చలి గుప్పిట్లో దేశ రాజధాని

ఢిల్లీ: నిన్నటి వరకు తీవ్ర వాయు కాలుష్యంతో విలవిలలాడిన దేశ రాజధాని ఢిల్లీని ప్రస్తుతం చలి వణికిస్తోంది. చలి గుప్పిట్లో చిక్కుకుని దేశ రాజధాని అతలాకుతలమవుతోంది. ఢిల్లీలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. తీవ్ర చలితో ఢిల్లీ వాసులు వణికిపోతున్నారు. నగరంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 7 డిగ్రీల సెల్సియ స్‌కు పడిపోవడంతో తీవ్ర చలిగాలులు వీస్తున్నాయి. మరోవైపు ఢిల్లీని దట్టమైన పొగమంచు కప్పేసింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ లో కొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కారణంగా దృశ్యమానత దాదాపు సున్నాకు పడిపోయింది. దీంతో తెల్లవారాక కూడా ఢిల్లీలో చీకట్లు కమ్ముకున్నాయి. వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వస్తోంది. ఒకవైపు తీవ్ర చలి, మరోవైపు పొగమంచు కప్పేయడంతో బయటికి రావాలంటేనే ఢిల్లీ వాసులు గజగజ వణికిపోతున్నారు.

# ఎట్టి పరిస్థితుల్లో... హామీలను విస్మరించం




## ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల లోగో, పోస్టర్, దరఖాస్తు ఫారం విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి

## రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

హైదరాబాద్: ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల లోగో, పోస్టర్, దరఖాస్తు ఫారంను విడుదల చేశారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. "డిసెంబరు 28 నుంచి గ్రామాలు, పట్టణాలు, మున్సిపల్ వార్డుల్లో ఐదు పథకాలకు (మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూతసంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తాం. ఎనిమిది పనిదినాల్లో గ్రామ సభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. జనవరి 7లోపు లబ్ధిదారుల వివరాలు సేకరించేందుకు యత్నిస్తున్నాం. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందించాలని నిర్ణయించాం. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి న్యాయం చేసేందుకు యత్నిస్తుంది. ప్రతి మండలానికి తహసీల్దార్ బాధ్యత వహిస్తారు. ప్రతి అధికారి రోజూ రెండు గ్రామాలను సందర్శిస్తారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది.

**ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం :** గడీల మధ్య జరిగిన పాలనను గ్రామాలకు తీసుకువస్తున్నాం. పజావాణిలో సమస్య పరిష్కారం కాలేదని ఓ మహిళ మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసినట్లు తెలిసింది. బాధిత మహిళకు ఆయన ?లక్ష సాయం అందించారు. కేటీఆర్ దోచుకున్న కోట్ల రూపాయల్లో బాధితురాలికి ?లక్ష ఇచ్చారు. దోచుకున్న సొమ్ము మొత్తం ప్రజలకు చేరేలా చేస్తాం. గత ప్రభుత్వ హయాంలో 22 కొత్త కార్లు కొని దాచి పెట్టారు. మూడోసారి అధికారంలోకి వస్తే వాటిని వాడుదామనుకున్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు వెనక్కి పోతే కేంద్రాన్ని నిలదీయలేదు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయి. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ లేకుండా పరీక్షల ప్రక్రియ జరగదు. టీఎస్‌పీఎస్సీ సభ్యులు ఇప్పటికే రాజీనామాలు సమర్పించారు. గవర్నర్ నిర్ణయం తీసుకున్నాక కొత్త బోర్డును ఏర్పాటు చేసి ఛైర్మన్, సభ్యులను నియమిస్తాం. అనంతరం ఉద్యోగ నియామకాలు చేపడతాం. గ్రూప్- 2 పరీక్షలపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

**రైతుబంధుకు ఎలాంటి పరిమితి విధించలేదు :** మేడిగడ్డకు సంబంధించి న్యాయ విచారణ జరుగుతోంది. విచారణ తర్వాత ఎల్ అండ్ టీ, అధికారుల పాత్ర ఏమిటనేది తేలుతుంది. గత ప్రభుత్వ అవినీతిపై శ్వేతపత్రాలు విడుదల చేశాం. ?6.71లక్షల కోట్లు అప్పులు చేసి నిండా ముంచారు. పరిస్థితుల నుంచి తేరుకుని ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తున్నాం. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబడతాం. రైతు బంధుకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి పరిమితి విధించలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతమైంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల పరిస్థితిని ముందే ఊహించాం. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకుంటాం. నిధులు దుర్వినియోగం కాకుండా చూస్తే పథకాలకు ఉపయోగపడుతుంది" అని రేవంత్ రెడ్డి తెలిపారు.

**గతంలో గడీల మధ్య పాలన.. ఇప్పుడు ప్రజల వద్దకే ప్రభుత్వం :** గత పదేళ్లలో ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో లేదని, ప్రజావాణిలో వచ్చిన 24 వేల ఫిర్యాదులే అందుకు ఉదాహరణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం సచివాలయంలో 5 గ్యారెంటీలకు సంబంధించిన ఉమ్మడి దరఖాస్తు పత్రాన్ని సీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు మోయలేని భారాన్ని గత పదేళ్లలో మోసారని అన్నారు. ఒకప్పుడు ప్రజలకు సమస్యలు ఉంటే ప్రభుత్వం దగ్గరకు వస్తే గడీలు అడ్డుగోడలుగా ఉండేవని, కానీ ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల వద్దకు నడిచి వెళ్తోందన్నారు. ప్రజా పాలనలో ప్రజలకు తమ మీద మరింత విశ్వాసం కలుగుతుందన్నారు. గతంలో గడీల మధ్య పాలనా నడిచిందని.. ఇప్పుడు ప్రభుత్వమే ప్రజల కోసం వారి వద్దకు వెళు తుందన్నారు. ఒకప్పుడు సచివాలయం అంటే ఏదో తెలియదని, సచివాలయం లోపల మీడియా సమావేశం ఉంటుందని ఎవరైనా ఊహించారా అని అడిగారు. ఇక మీదట సెక్రటేరియెట్‌లో మీడియా సెంటర్ ఉంటుందన్నారు. మంత్రులు, అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కేటీఆర్ లక్ష కోట్ల సంపాదన నుంచి లక్ష రూపాయలు బాధిత మహిళకు ఇచ్చారని, మిగతా సొమ్ము అంతా కక్కిస్తామని హెచ్చిరంచారు.

## దేశవ్యాప్తంగా 100 దాటిన జేఎన్.1 సబ్ వేరియంట్ కేసులు

దిల్లీ: దేశంలో ఇటీవల వెలుగు చూసిన కొవిడ్-19 ఉపరకం జేఎన్.1 కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఒక్కరోజులోనే 40పైగా కొత్త కేసులు నిర్ధారణ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా జేఎన్.1 పాజిటివ్ కేసుల సంఖ్య 109కి చేరినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. గుజరాత్‌లో అత్యధికంగా 36 కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో 34, గోవాలో 14, మహారాష్ట్రలో తొమ్మిది, కేరళలో ఆరు, రాజస్థాన్, తమిళనాడులలో నాలుగు చొప్పున, తెలంగాణలో రెండు కేసులు నిర్ధారణ అయ్యాయి. వీరంతా ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లోనే ఉన్నట్లు సమాచారం. కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. బాధితుల్లో 92శాతం మంది ఇంటి వద్దే చికిత్స తీసుకుంటున్నారని తెలిపింది. ఆసుపత్రిలో చేరే పరిస్థితి కూడా తక్కువేనని, కేవలం ఇతర ఆరోగ్య సమస్యలతో చేరుతున్న వారిలోనే యాదృచ్ఛికంగా కొవిడ్ బయటపడుతోందని వెల్లడించింది.

## ఈటల రాజేందర్ దారెటు?



హైదరాబాద్ : తెలంగాణలో బీజేపీ హవాను అడ్డుకుని కాంగ్రెస్ లబ్ధిపొందింది. బీజేపీనే తన సొంత తెలివితేటలతో అధికారం దూరం చేసుకుంది. కాంగ్రెస్ బీజేపీపై చేసిన ప్రచారం బాగా పనిచేసింది. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మూడు ఒక్కటే అని బాగా ప్రచారం చేయడం వల్ల ఆ పార్టీకి తీవ్ర నష్టం కలిగింది. ఫలితంగా రాష్ట్రంలో బీజేపీకి అనూహ్య పరాభవం ఎదురైంది. దీంతో నేతలు అంతర్మథనంలో పడిపోయారు. తమదే అధికారం అని గొప్పలు చెప్పుకున్నా చివరకు అపజయమే పలకరించడం గమనార్హం. బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ ఉన్నంత కాలం పార్టీ ప్రతిష్ట ఇనుమడించింది. మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కుట్రల వల్ల బండి సంజయ్ ను అధిష్టానం అధ్యక్షుడిగా మార్చేసింది. దీంతో పార్టీ ప్రతిష్ట మసకబారింది. కాంగ్రెస్ పుంజుకుంది. అధికారం దక్కించుకుంది. ఇది ముమ్మాటికి బీజేపీ నేతల తప్పిదమే అని తేలింది. ఈటల రాజేందర్ నిర్వాకం వల్లే బీజేపీ తీవ్రంగా నష్టపోయింది. ఈటల రాజేందర్ కూడా వాపును చూసుకుని బలుపుగా భావించుకున్నారు. గతంలో జరిగిన హుజురాబాద్ ఉప ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీని ఓడించి అధికారం దక్కించుకున్న ఈటల రాజేందర్ కు తల పొగరు ఎక్కింది. దీంతో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్ తో పాటు కేసీఆర్ మీద గజ్వేల్ లో కూడా పోటీకి నిలిచారు. కానీ ఓటర్లు రెండు చోట్ల కీలెరిగి వాత పెట్టారు. దీంతో పరాభవం మూటకట్టుకున్నారు. బీజేపీలో కీలక నేతగా ఎదిగినా పార్టీని నయవంచనతో నష్టాల్లోకి నెట్టారనే అపవాదు మూటగట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో అంతర్మథనంలో పడిపోయారు. తనకు ఎదురు లేదని భావించినా చివరకు నిరాశే మిగిలింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే ఎక్కడినుంచైనా పోటీకి సిద్ధమనే సంకేతాలు ఇస్తున్నారు. బీజేపీలో దమ్మున్న లీడర్లుగా పేరుతెచ్చుకున్న బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ లు అసెంబ్లీ ఎన్నికల్లో పరాభవం తరువాత వారికి పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్లు ఇస్తారో లేదో అనే చర్చలు కూడా వస్తున్నాయి. ప్రస్తుతం ఓటమి చెందిన ఈటల దారెటు అనే చర్చ కూడా సాగుతోంది. హుజురాబాద్ నుంచి ఏడు సార్లు గెలిచిన ఈటలను ప్రజలు ఎందుకు తిరస్కరించారు? ఈటలను ఎందుకు పక్కన పెట్టారు? అనే వాదనలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈటల ఎటు వెళతారనే చర్చ కూడా వస్తోంది. పార్టీ మారతారనే వార్తలు గతంలో పలుమార్లు చక్కర్లు కొట్టాయి. బీజేపీలో ఉన్న పేరు కాస్త పోవడంతో పార్టీ మారి తన భవిష్యత్ పై కొత్త ఆశలతో ముందుకు వెళ్తారో లేదా బీజేపీలోనే ఉండి తన పట్టు నిలుపుకుంటారో లేదా వేచి చూడాల్సిందే.

# పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా... మరో మారు రాహుల్ జోడో యాత్ర



పదేళ్లుగా కేంద్రంలో అధికారానికి దూరమైన కాంగ్రెస్ మరోసారి చేపట్టేందుకు పావులు కదుపుతోంది. అందుకు తగ్గట్లుగా ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

ప్రస్తుతం దేశంలో మోడీ హవా కొనసాగుతున్న వేళ చాకచక్యంగా ప్రజలకు మరింత దగ్గరైతే మోడీ హవాను కాంగ్రెస్ వైపు మళ్లించవచ్చని అనుకుంటుంది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నా రు. దీంతో ఈ సారి అధికారం ఖాయమని పొలిటికల్ అనలసిస్ట్ ల సూచనలతో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ముందుకు వెళ్తున్నాడు.

**భారత్ జోడో యాత్ర నేపథ్యం...** బీజేపీ ప్రభుత్వ సంస్కరణలకు వ్యతిరేకంగా దేశ ప్రజలను ఏకం చేసేందుకు ఎంపీ, అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో 'భారత్ జోడో యాత్ర' చేపట్టారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ఈ యాత్ర సాగింది. 2022, ఆగస్ట్ లో ఈ యాత్రపై పార్టీలో చర్చలు ప్రారంభమ్యాయి. 2022, సెప్టెంబర్ 7వ తేదీన యూపీఏలో భాగస్వామి అయిన డీఎంకే నేత, తమిళనాడు సీఎం స్టాలిన్ కన్యాకుమారిలో ఈ యాత్రను ప్రారంభించారు.

ఐదు నెల్లలో 12 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 3,500 కిలో మీటర్లకు పైగా ఈ యాత్ర సాగింది. ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి 10.30 గంటల వరకు మధ్యహ్నాం 3.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు రెండు దఫాలుగా ఈ యాత్రను చేపట్టారు. అంటే రోజుకు 22 నుంచి 23 కిలో మీటర్లు యాత్ర సాగింది.

**మళ్లీ ప్రారంభించనున్న రాహుల్..** రాహుల్ భారత్ జోడో యాత్ర తర్వాత గతంలో కంటే కాంగ్రెస్ కు ఓటు బ్యాంకు పెరిగిందని కొన్ని సర్వేలు సూచించాయి. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంగా పని చేయడం మొదలు పెట్టారు. దీంతో పార్టీ బీజేపీకి ధీటుగా పని చేయడం మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో మళ్లీ ఈ యాత్ర చేపడితే మరింత ప్రయోజనం ఉంటుందని అనుకుంటున్నారు రాహుల్ గాంధీ. అందుకే వచ్చే నెల (జనవరి) నుంచి రెండో విడుత యాత్ర చేపట్టాలని ప్రణాళికలు వేస్తున్నారు. ప్రస్తుతానికి రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదు. అయితే మొదటి విడుతలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ కు నడిచారు.

అయితే.. ఈ సారి ఏప్రిల్ లేదంటే మేలో లోక్ సభ ఎన్నికలు ఉండడంతో ఆ లోపే ముగించాలని చూస్తున్నారు. అందుకే దీన్ని హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ యాత్ర గురించి ఇప్పటి వరకు అధికారికంగా ప్రకటన వెలువడకపోయినా.. పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ఈ సారి యాత్ర ఎంతో కొంత కలిసి వస్తుందని, అందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు అధినాయకులు పిలుపు ఇచ్చినట్లు తెలుస్తోంది.

# సంపాదకీయం

## బ్యూరోక్రటిక్ పాలిటిక్స్..

### జేడీ పార్టీ మరో జేపీ పార్టీ అవుతుందా?

భారత దేశంలో ఎవరైనా రాజకీయాల్లోకి రావొచ్చు.. రాజకీయాలు ఫలానావారే చేయాలని ఏం లేదు.. అందులోనూ బాగా చదువుకున్న వారు ఈ రంగంలోకి వస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుంది. అవినీతి, అక్రమాలకు అవకాశం తక్కువగా ఉంటుంది. పాలనా వ్యవస్థపై పట్టున్నవారు కావడంతో ఏం చేస్తే ఎలా చేస్తే మేలు జరుగుతుందో తెలుస్తుంది.

**బ్యూరోక్రటిక్ పార్టీలు నిలుస్తాయా?** తెలుగు రాష్ట్రాల్లో 20 ఏళ్ల కిందటనే సంచలనం రేపిన పార్టీ లోక్ సత్తా. మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ (జేపీ) స్థాపించిన ఈ పార్టీకి మొదట్లో విద్యావంతుల నుంచి ఆదరణ కూడా బాగానే దక్కింది. అయితే, డబ్బు, మద్యం పంపిణీ చేయకుండా గెలుస్తామనే లోక్ సత్తా ఆదర్శాలు ఆచరణలోకి రాలేదు. ఎన్నికలకు వచ్చేసరికి ఆ పార్టీ కూడా ఇతర పార్టీల్లాగే మారిపోయింది. దీనికి తోడు జేపీ ప్రసంగాలు సగటు గ్రామీణ వ్యక్తులకు అర్థం కాలేదు. దీంతో లోక్ సత్తా ఒక బ్యూరోక్రటిక్ పార్టీగా మిగిలిపోయింది. ఇప్పుడు లోక్ సత్తా కేవలం ఒక స్వచ్ఛంద సంస్థ, లేదా ప్రజా సంఘం పాత్రకు పరిమితమైపోయింది.

**మరి జేడీ సంగతేమిటి..?** లోక్ సత్తా వ్యవస్థాపకుడు జేపీ ఇప్పుడొక రాజకీయ విశ్లేషకుడిగా మిగిలారు. మేధావి మన్ననలు అందుకున్న ఆయన ఇటీవలి తెలంగాణ ఎన్నికల్లో రాజకీయ నాయకుల ఇంటర్వ్యూలు చేస్తూ కనిపించారు. ప్రభుత్వాల ఉచిత పథకాలను విమర్శించడం, ఉద్యోగుల పింఛను పథకంపై తన అభిప్రాయాలు వ్యక్తం చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తున్నారు. ఇక లోక్ సత్తా రాజకీయాలను ఆయన పూర్తిగా వదిలేసినట్లే అని స్పష్టమవుతోంది. మరి ఇదే సమయంలో సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ (జేడీ) లక్ష్మీనారాయణ కూడా జేపీ తరహాలో రాజకీయ పార్టీని స్థాపించారు. దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. వాస్తవానికి జేడీ లక్ష్మీనారాయణగా ఆయన అందరికీ తెలిసినా.. పూర్తి పేరు వీవీ లక్ష్మీనారాయణ. అయితే, సీబీఐ జేడీగా పనిచేసినందున జేడీ ఆయన పేరుముందు స్థిరపడిపోయింది.

**సామాన్యులకు చేరే విధివిధానాలు ముఖ్యం :** జేడీ అయినా జేపీ అయినా.. ఇద్దరూ ఉన్నత స్థాయి బ్యూరోక్రాట్లే. సొంతంగా పార్టీలు పెట్టిన వీరిద్దరూ సామాన్య ప్రజలను చేరుకోవడం చాలా కీలకం. జేపీ పార్టీ స్థాపించినప్పటికీ ఇప్పటికీ పరిస్థితులు చాలా తేడా ఉన్నాయి. 25 ఏళ్ల కిందట లోక్ సత్తా వచ్చినప్పుడు ఇన్ని ఉచిత పథకాలు లేవు. అప్పట్లో కాంగ్రెస్ ఉచిత విద్యుత్తు హామీని అందరూ అసాధ్యం అన్నారు. ఇప్పుడు చూస్తే కొన్ని వర్గాల వారికి అన్నీ ఉచి తమే అన్నట్లుంది పరిస్థితి. ఉచితాలు వద్దంటే ప్రజల మద్దతు దక్కదు..? ఉచితాలు కావాలంటే మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇబ్బంది. మరి జేడీలాంటి వ్యక్తి దీనిని ఎలా చూస్తారు? అనేది కీలకం.

**జనంలో కలవాలి.. ఉర్రూతలూగించాలి..** అధికార సాధనే పార్టీ లక్ష్యం కాబట్టి దానిని అందుకోవాలంటే తీవ్రంగానే శ్రమించాల్సి ఉంటుంది. జనంలో కలవాలి.. ప్రసంగాలతో వారిని ఉర్రూతలూగించాలి.. దీనికోసం బ్యూరోక్రటిక్ తాలూకు స్వభావాలను వదిలించుకోవాలి. అలాగైతేనే ప్రజాదరణను భారీగా పొందే అవకాశం ఉంటుంది. శుక్రవారం నాడు పార్టీ వ్యవస్థాపనా ప్రకటన సందర్భంగా జేడీ లక్ష్మీనారాయణ ప్రసంగం ఫర్వాలేదనే స్థాయిలో ఉంది. అయితే, ఏపీకి ప్రత్యేక హెుదా అనే అంశమే కీలకమైతే మరి ఇన్నాళ్లూ ఏం చేశారనే ప్రశ్న తలెత్తుతోంది. అన్నిటికి మించి రాజకీయాల్లో ఎదురుదాడి ముఖ్యం. మాటకు మాట అనేలా ఉంటేనే ప్రజలు నాయకుల వెంట ర్యాలీ అవుతారు. అందులోనూ ఏపీ వంటి ప్రత్యేక పరిస్థితులున్న రాష్ట్రంలో ఇది మరీ కీలకం. కొసమెరుపు: జేడీ దాదాపు పదేళ్లు లోక్ సత్తాను నడిపి 2009లో కూకట్ పల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. సమైక్యవాదిగా పేరున్న ఆయన తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. ఇప్పుడు జేడీ వంతు వచ్చింది. గత ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి జన సేన తరఫున పోటీ చేసిన ఆయన చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఓట్లు తెచ్చుకున్నారు. అదే పార్టీలో కొనసాగితే ఎలా ఉండేదో కానీ.. ఎన్నికలు అయిన వెంటనే జన సేనకు గుడ్ బై చెప్పారు. ఇప్పుడు ఏపీలో రాజకీయం టీడీపీ-జనసేన వర్సెస్ వైసీపీ అన్న తీరున ఉంది. ఇందులో జేడీ ఎంతవరకు నెగ్గుతారో చూడాలి.

# ఆన్లైన్లో - రూ. 50,000/- వరకు పోగొట్టుకుంటే స్థానిక పీఎస్ లో ఫిర్యాదు చేయవచ్చు

## ఆన్లైన్లో రూ. 50,000/- కంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటే సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు

## సైబర్ క్రైమ్స్ ఎఫ్ఐఆర్‌ల నమోదు పై సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి పలు సూచనలు




సైబరాబాద్ క్రైమ్ (గరుడ వార్త) : సైబర్ క్రైమ్స్ కేసుల ఎఫ్ఐఆర్ నమోదు విషయంలో ప్రజలు ఎదుర్కుంటున్న ఇబ్బందులను గమనించిన సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఐపీఎస్ పలు సూచనలు చేశారు. గతంలో సైబర్ క్రైమ్స్ ఆర్థిక నేరాల విషయంలో రూ.1,50,000/- కంటే ఎక్కువ మొత్తంలో డబ్బు పోగొట్టుకున్న సందర్భంలో ప్రజలు సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి దర్యాప్తు చేసేవారు. అలాగే రూ.1,50,000/- కంటే తక్కువ మొత్తంలో డబ్బు పోగొట్టుకున్న సందర్భంలో స్థానిక పోలీస్ స్టేషన్ లో ప్రజలు ఫిర్యాదు చేసేవారు. అయితే ఇటీవల కాలంలో సైబర్ క్రైమ్స్ నేరాలు ఎక్కువ అవుతుండడం, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు గాను సైబర్ క్రైమ్స్ ఆర్థిక నేరాల కేసుల దర్యాప్తు కోసం సైబరాబాద్ సీపీ పలు సూచనలు చేశారు. ప్రజలు ఏదైనా సైబర్ క్రైమ్స్, ఆన్లైన్లో రూ. 50,000/- వరకు పోగొట్టుకుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చున్నారు. అట్టి కేసులను ఇన్ స్పెక్టర్ / డిఐ ర్యాంక్ అధికారులు దర్యాప్తు చేస్తారన్నారు. ఒక వేల ప్రజలు సైబర్ క్రైమ్, ఆన్లైన్లో రూ. 50,000/- కంటే ఎక్కువ మొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటే సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అట్టి కేసులను సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇన్ స్పెక్టర్ ర్యాంక్ అధికారి దర్యాప్తు చేస్తారన్నారు. సైబర్ క్రైమ్స్ నేరాలకు సంబంధించిన ఇతర ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్ నమోదు చేయాలని ప్రజలకు సీపీ గారు సూచించారు.

# మట్టి.. కొల్లగొట్టి



కొణిజర్ల : నీటి పారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం.. జేసీబీ యజమానులు, మట్టి వ్యాపారులకు వరంగా మారింది. సాగర్ ఎడమ కాల్వ పక్కనున్న మట్టి వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. కాల్వ తవ్వినపుడు మట్టిని దానిపక్కన పెద్దపెద్ద గుట్టల్లా పోశారు. రూ.కోట్లు విలువ చేసే ఆ మట్టి గుట్టలు ప్రస్తుతం కరిగిపోతుతున్నాయి. ప్రస్తుతం మట్టి, గ్రావెల్‌కు డిమాండ్ ఎక్కువ ఉంది. వేసవిలో పొలాలు చదును చేసుకునేవారు, రియల్ వెంచర్లలో రోడ్లు, ఇతరత్రా చదును చేసే పనులకు మట్టి అధికంగా అవసరం ఉంటుంది. వెంకటాయపాలెం, తనికెళ్ల, రామనర్సయ్యనగర్, విక్రంనగర్, ఉప్పలచెలక, ఏన్కూరు మండలం తిమ్మారావుపేట, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, ఇలా కాల్వ ఉన్న ప్రతి మండలంలో మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. వారం రోజులుగా విక్రంనగర్, ఉప్పలచెలక దగ్గర ఉన్న గద్దలగూడెం మేజర్ వద్ద జేసీబీలతో మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామనే సాకులు చెబుతూ మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ట్రాక్టర్ మట్టికి రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. బోడియాతండా, గుబ్బగుర్తి, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు మండలాలకు చెందిన కొందరు వ్యాపారులు ఇదే పనిగా పెట్టుకుని కాల్వ మట్టిని తరలిస్తున్నారు.

నిబంధనలను పక్కనపెట్టి..

మట్టిని వినియోగించుకోవాలంటే జలవనరుల శాఖ అధికారులకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం మట్టి తరలించడానికి అనుమతి ఇస్తారు. అది కూడా రైతులకు మాత్రమే వీలుంటుంది. ఇక్కడ రైతుల పేరుతో వ్యాపారులు మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు కాలువపై ప్రయాణం చేస్తే ఎంత మట్టి బయటకు తరలిపోయిందో స్పష్టంగా అర్థమవుతుంది. ఈ విషయంపై స్థానిక రైతులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకునే పరిస్థితి లేదు. మట్టి తరలిస్తున్నారనే సమాచారాన్ని రాత్రిపూట చెబితే ఆ సమయంలో ఎలా వస్తామంటరూ.. పగటి వేళ చెబితే అంతా దూరం ఎలా రావాలంటూ అధికారులు తప్పించుకుంటున్నారనే వాదనలున్నాయి.. విలువైన కాలువ మట్టిని కాపాడుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే 70 శాతం వరకు మట్టిని బయటకు తరలించారు. ఉన్న మట్టిని కాపాడుకోకపోతే మేజర్లు, మైనర్లు, ఇతర కాలువలకు గండ్లు పడినపుడు వాడుకోవడానికి మట్టి దొరకడం కష్టమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మట్టి వ్యాపారంపై దృష్టి సారిస్తే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుంది.

మా దృష్టికి రాలేదు: అబీద్, ఎన్నెస్పీ, ఏఈ

గద్దలగూడెం మేజర్ వద్ద మట్టి తోలకాలు మా దృష్టికి రాలేదు. సాగర్ ప్రధాన కాలువ పక్కన కాబట్టి మానిటరింగ్ అధికారులు చూస్తారు. మాకు సంబంధం లేదు. వారి దృష్టికి తీసుకువెళ్తాను.

# చేపల వంటకాలు భలే.. భలే!

ఖమ్మం : తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లాలో (జూన్ 6, 7, 8), ఖమ్మం జిల్లాలో (జూన్ 8, 9, 10) చేపల ఆహార దినోత్సవం (ఫిష్ ఫుడ్ ఫెస్టివల్) నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన స్టాల్స్ ఏర్పాటుకు అధికారులు యత్నిస్తున్నారు. చేపలు, రొయ్యలతో నోరూరించే వంటకాలను అందుబాటులో ఉంచనున్నారు.

శిక్షణ పొందిన సభ్యులతో...

మహిళా మత్స్య సహకార సంఘాలకు చెందిన 27 మందికి గత ఫిబ్రవరిలో ఖమ్మంలోని టీటీడీసీలో 'సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వా కల్చర్- విశాఖపట్నం' ఆధ్వర్యంలో చేపల వంటకాలపై శిక్షణ ఇచ్చారు. తర్ఫీదు పొందిన వారికి రూ.50వేల విలువైన వంటల తయారీ పరికరాలను ఉచితంగా అందించారు. మరో 21 మందికి హైదరాబాద్‌లో చేపల వంటకాలపై ఇటీవల శిక్షణ ఇచ్చారు. తర్ఫీదు పొందిన వారితోనే ఫుడ్ ఫెస్టివల్‌ను అధికారులు నిర్వహిస్తారు. వివిధ రకాల రుచికరమైన వంటకాలను తయారుచేయటం ద్వారా వినియోగదారులను ఆకర్షిస్తారు. మత్స్య సహకార సంఘాల సభ్యులు మొబైల్ ఫిష్ ఔట్‌లెట్ నిర్వహించుకునేందుకు తోడ్పాటునందిస్తారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మత్స్య సహకార సంఘాలు బలోపేతమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

చేపలు మంచి పోషకాహారం. వీటిని ఏరూపంలో తీసుకున్నా ఆరోగ్యానికి మేలు. చాలామందికి చేపల వంటకాలపై అవగాహన లేదు. అందుకే ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. చేపల వినియోగాన్ని పెంచటమే కార్యక్రమం ఉద్దేశం. ఫుడ్ ఫెస్టివల్ విజయవంతానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. పది స్టాళ్లను నెలకొల్పుతున్నాం.

చేపల పచ్చళ్లు కొర్రమీను పచ్చళ్లు ఫిష్ బర్గర్స్ ఫిష్ సమోసా

# పత్తి విత్తనాలపై కంపెనీల పెత్తనం

ఖమ్మం : ఈ సంవత్సరం కంపెనీలు వివిధ రకాల పత్తి విత్తనాల ధరలు పెంచి రైతుల నడ్డి విరుస్తున్నాయి. బీటీ-2 రకం పత్తి విత్తనాల ప్యాకెట్ ధర గతేడాది రూ.810 ఉండగా ఈసంవత్సరం రూ.853గా కంపెనీలు ధర నిర్ణయించాయి. ప్యాకెట్‌కు రూ.43 చొప్పున పెంచాయి. దీనివల్ల విత్తనాల రూపంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులపై సుమారు రూ.4 కోట్లకు పైగా అదనపు భారం పడుతోంది. పెట్టుబడులు పెరిగి..ఇప్పటికే పెట్టుబడులు భారీగా పెరిగి సేద్యం చేయలేని రైతులకు ఇది పిడుగులాంటి వార్తే. కంపెనీల నిర్ణయం రైతులకు నష్టం కలిగిస్తుంది. ఏటా వానాకాలం సీజన్‌లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 4.80 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తారు. ఉభయ జిల్లాల్లో అత్యధికంగా సాగు చేసే వాణిజ్య పంట ఇదే కావటం విశేషం. ఒకవైపు పత్తికి ఆశించిన స్థాయిలో మద్దతు ధర లభించకపోవటం, సరైన దిగుబడులు రాకపోవటం, ఎగుమతులు లేక ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ట్రాక్టర్లు, డీజిల్, ఎరువులు, కూలీల ధరలు విపరీతంగా పెరిగాయి. తాజాగా పత్తి విత్తనాల ధర పెంచుతూ కంపెనీలు నిర్ణయం తీసుకోవటం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు రైతుల పరిస్థితి తయారైంది.

ధర లేక దిగాలుక్వింటా పత్తికి కనీసం రూ.9వేల పైన ధర పలికితేనే రైతుకు కొంతవరకు గిట్టుబాటు అయ్యే అవకాశముంది.

# మణుగూరుకు కొత్తరూపు

మణుగూరు : మణుగూరు పట్టణం రూపురేఖలు మరోసారి మారనున్నాయి. సింగరేణి బొగ్గు గనులు, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం ఏర్పాటుతో మణుగూరు పారిశ్రామికంగా విరాజిల్లుతుంది. అయితే 2009-15 మధ్యలో ఏర్పాటైన మణుగూరు ఓపెన్ కాస్ట్‌తో పట్టణ ముఖచిత్రం నుంచి గ్రామాలు కనుమరుగయ్యాయి. మళ్లీ ఇప్పుడు బీటీపీఎస్ రైలు మార్గం కోసం పట్టణంలోని 113 ఇళ్లను తొలగించనున్నారు. ఈ నేపథ్యంలో మణుగూరు మళ్లీ కొత్తరూపు సంతరించుకోనుంది. ఇప్పటికే రైలు మార్గం కోసం సేకరించిన ఇళ్లను రెవెన్యూశాఖ నేలమట్టం చేస్తోంది.

ప్రత్యేక ఆకర్షణగా రైలు మార్గం

పట్టణ నడిబొడ్డు నుంచి బీటీపీఎస్ రైలు మార్గం ఏర్పాటు కానుంది. దీంతో ఆ రైలు మార్గం ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. ఓ వైపు నివాసాలు, మరోవైపు రైలు మార్గం నుంచి బొగ్గు రవాణా జరగనుంది. అంతేకాకుండా రైలుమార్గం కోసం ఏర్పాటు చేస్తున్న వంతెనలు సైతం పట్టణ మార్పునకు సంకేతం కానున్నాయి. రాజుపేటకు వెళ్లే రోడ్డులో అండర్ బ్రిడ్జి నిర్మించారు. విద్యుత్తు కార్యాలయం సమీపంలో ప్రధాని రహదారిపై మరో అండర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. చెరువుముందు గ్రామంలో రైలు మార్గం వై జంక్షన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

పట్టణ విస్తరణ అనివార్యం



సింగరేణి బొగ్గు గనులు, రైలు మార్గం ఏర్పాటుతో మణుగూరు పట్టణం విస్తీర్ణం తగ్గుతుంది. భవిష్యత్తులో పట్టణ విస్తరణ అనివార్యం కానుంది. పట్టణ జనాభా క్రమేణా పెరుగుతుంది. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ సంస్థ సర్వేలో జనాభా పెరుగుదలలో మణుగూరు తొలి స్థానంలో ఉంది. ఈక్రమంలో జనాభాకు తగిన సౌకర్యాలు, నివాసాలు అవసరం కానున్న నేపథ్యంలో పట్టణానికి ఆనుకొని ఉన్న పంచాయతీల్లోని కొంత భాగాన్ని పురపాలకంలో కలిపితే ఉపయోగకరంగా ఉంటుంది. కొన్నేళ్ల క్రితం సమితిసింగారంలోని కొంత భాగాన్ని పురపాలకంలో కలపాలని అధికారులు సర్వే చేశారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ఏదేమైనా రానున్న కాలంలో మణుగూరు పట్టణం విస్తరణ వైపు దిశగా వెళ్లాల్సిన అవసరం ఉంది.

దశల వారీగా కూల్చి వేస్తున్నాం

నాగరాజు, తహసీల్దార్

బీటీపీఎస్ రైలు మార్గం కోసం తీసుకొన్న ఇళ్లను దశల వారీగా కూల్చి వేస్తున్నాం. అర్అండ్ఆర్ ప్యాకేజీ తీసుకొన్న వారు ఇళ్లను ఖాళీ చేయాలని సూచించాం. ఇప్పటి వరకు 15 ఇళ్లు నేలమట్టం అయ్యాయి.

# ఎక్కడి వాళ్లక్కడే!

హనుమకొండ : పారిశుద్ధ్య కార్మికుల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పనిచేసేది ఒక దగ్గర, బయోమెట్రిక్ అటెండెన్సు మరో చోట వేస్తున్నారు. దీనివల్ల సుమారు 250-300 మంది కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కొందరు అటెండెన్సు వేసి ఇంటికెళ్తున్నట్లు గుర్తించారు. ఇలాంటి పని దొంగలను పట్టేందుకు ప్రజారోగ్య విభాగం దృష్టి సారించింది. వారం రోజుల క్రితం కొత్త కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ఐదారుగురు శానిటేషన్ కార్మికులు ఎక్కడ పనిచేస్తున్నారో చూపించ లేకపోయారు. బయోమెట్రిక్ అటెండెన్సులో విధులకు హాజరైనట్లుగా ఉంది, వాళ్లు ఎక్కడున్నారని కమిషనర్ అడిగితే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు బేలచూపులు చూశారు. పొంతన లేని సమాధానాలు చెప్పడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడ బయోమెట్రిక్ అటెండెన్సు వేస్తున్నారో అదే డివిజన్‌లో పనిచేసేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలోని 66 డివిజన్ల వారీగా పారిశుద్ధ్య కార్మికుల జాబితా సిద్ధమైంది. ఎక్కడి వాళ్లక్కడే పనిచేసేలా కొత్త పద్ధతి అమల్లోకి రానుంది.

10వేల జనాభాకు 28 మంది కార్మికులు : రాష్ట్ర పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నగరంలోని 66 డివిజన్ల వారీగా పారిశుద్ధ్య కార్మికుల కేటాయింపుపై గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్య విభాగం దృష్టి సారించింది. 10 వేల జనాభా కలిగిన డివిజన్‌కు 28 మంది కార్మికులు పనిచేయాలి. ఇదే పద్ధతిన డివిజన్ల వారీగా జనాభాను



పరిగణలోకి తీసుకొని శానిటేషన్ కార్మికులను కేటాయిస్తారు. ఒక్కో డివిజన్‌కు 35-40 మందిని కేటాయించే అవకాశాలున్నాయి. ఎక్కడి వాళ్లక్కడే పని చేసేలా జాబితా సిద్ధం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. జూన్ మొదటి వారం నుంచి కొత్త విధానం అమల్లోకి రానుంది.

కార్మికుడి నిరసన: హనుమకొండ ప్రాంతంలో పనిచేస్తున్న కె.చిన్నబాబు అనే శానిటేషన్ కార్మికుడు సోమవారం మధ్యాహ్నం బల్దియా ప్రధాన కార్యాలయంలోని ముఖ్య ఆరోగ్యాధికారి ఛాంబర్ ముందు హల్‌చల్ చేశారు. ఒక డివిజన్ నుంచి మరొక డివిజన్‌కు వెళ్లాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి చేస్తున్నారంటూ కాలం చెల్లిన సిరప్(మందు) తాగారు. వెంటనే అక్కడున్న వారు వారించి ఆసుపత్రికి తరలించారు. ఆరో డివిజన్‌లో పనిచేస్తున్నానని, 51 డివిజన్‌కు వెళ్లాలని ఇన్‌స్పెక్టర్ ఒత్తిడి చేశారని ఆరోపించారు.

పారదర్శకం చేస్తాం

- డాక్టర్ రాజేష్, ముఖ్యఆరోగ్యాధికారి

పారిశుద్ధ్య కార్మికుల పనితీరు పారదర్శకం చేస్తాం. కార్మికులు ఎక్కడైతే బయోమెట్రిక్ అటెండెన్సు వేస్తారో అక్కడే పనిచేయాలి. 66 డివిజన్ల వారీగా జాబితా సిద్ధమైంది. హనుమకొండకు చెందిన కార్మికుడి ఘటనపై విచారణ చేపడతాం.

# గురక భయపెడుతోంది!

హైదరాబాద్ : గురక వేధిస్తోంది.. యువత, పిల్లల్లోనూ సమస్య పెరుగుతోంది. రకరకాల కారణాలు ఇందుకు దోహదం చేస్తున్నాయి. నగరంలోని ఓ ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రి వైద్యుల పరిశీలనలో ఈ విషయం తేలింది. ఆసుపత్రిలో స్లీప్ ల్యాబ్‌కు గురక సమస్యతో ఏటా 360–450 మంది వస్తున్నారని వైద్యులు తెలిపారు. ప్రతి 100 మందిలో 30–40 మందికి సమస్య ఉంటోంది. ఇందులో 20 శాతం మందిలో అది అబ్‌స్ట్రెక్టివ్ స్లీప్ అప్నియాకు (ఓఎస్‌ఏ) దారి తీస్తోంది. శ్వాసనాళాలు మూసుకుపోయి నిద్రలోనే ఊపిరి తీసుకోవడం కష్టం అవుతుంది. ఊపిరితిత్తులకు ఆక్సిజన్ అందక ఒక్కసారిగా మెలకువ వచ్చేస్తుంది. ఫలితంగా రక్తంలో ఆక్సిజన్ తగ్గి.. దీర్ఘకాలంలో అనేక రకాల రుగ్మతలకు ఓఎస్‌ఏ కారణమవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కారణాలు ఇవే...జీవనశైలి కారణంగా చాలామంది అధిక బరువు, ఊబకాయంతో బాధపడుతున్నారు. ఇది చివరికి గురక సమస్యకు



కారణమవుతోంది. అది పెరిగి ఓఎస్‌ఏకు దారి తీస్తోంది. మద్యం, ధూమపానం లాంటివి సమస్యను మరింత పెంచుతున్నాయి.

ముక్కులోనూ ముఖం, మెడ, ఛాతీ ప్రాంతం చుట్టూ కొవ్వు అధికంగా చేరడం వల్ల అది శ్వాసనాళాలపై ప్రభావం చూపుతుంది. కొందరిలో టాన్సిల్స్ ఏర్పడతాయి.పిల్లల్లో టాన్సిల్స్, అడినాయిడ్స్ అలెర్జీలు గురక, ఓఎస్‌ఏ సమస్యను పెంచుతున్నాయి. ముక్కుతో ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడతారు. కొందరి పిల్లల్లో ఈ సమస్య హైపర్ యాక్టివిటీకి కారణమవుతుంది.

నిర్లక్ష్యం చేయొద్దు..– డాక్టర్ ఎన్.నళిని, సీనియర్ పల్మనాలజిస్టు, కాంటినెంటల్ ఆసుపత్రికేవలం గురక ఉంటే జీవనశైలిలో కొద్దిపాటి మార్పులతో సరిచేసుకునే అవకాశం ఉంది. అబ్‌స్ట్రెక్టివ్ స్లీప్ అప్నియా ఉంటే స్లీప్ టెస్టులు చేసి ఏ స్థాయిలో ఉందో నిర్ధారిస్తారు. సమస్య తొలి దశలో ఉంటే.. బరువు తగ్గడం, పొజిషనల్ థెరపీ, తలను కాస్త ఎత్తులో పెట్టుకోవడం తదితర జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చు. తీవ్రత ఎక్కువుంటే నిద్రపోయే సమయంలో సీపాప్, బైపాప్ పరికరాలతో చికిత్స అవసరం అవుతుంది. ఓఎస్‌ఏ సమస్యను నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో అవయవాలపై ప్రభావం చూపుతుంది.

# శివార్చన వేదిక నిర్మాణంపై నీలినీడలు

వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఏటా మహా శివరాత్రి జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ జాతర సందర్భంగా జాగరణ చేసే భక్తుల కోసం ఏటా శివార్చన పేరుతో పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వీటిని వేలాది మంది రాజన్న భక్తులు, కళాకారులు వీక్షిస్తుంటారు. ఎందరో కళాకారులు తమ ప్రతిభను ఈ వేదిక ద్వారా ప్రదర్శించి ప్రముఖుల మన్ననలు పొందుతుంటారు. ఇందుకు పెద్ద ఎత్తున శివార్చన వేదికను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తుంటారు. దీనికోసం ఏటా రూ.లక్షల్లో నిధులు వెచ్చిస్తుంటారు. దీంతో శాశ్వతంగా శివార్చన వేదిక నిర్మించాలని సంకల్పించిన వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) రూ.90 లక్షలను కేటాయించింది. అయిదు నెలల క్రితం అప్పటి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు చేపట్టిన గుత్తేదారు బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసి తరవాత వదిలేశారు. పనులు నిలిచిపోయి దాదాపు రెండు నెలలు అవుతున్నా తిరిగి మొదలు కాలేదు. దీంతో శివార్చన వేదిక నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వచ్చే మహా శివరాత్రి జాతర వరకు ఈ వేదిక పూర్తి కావడం అనుమానంగా కనిపిస్తోంది.

నిర్మాణం ఇలా...రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో కోడెల క్యూలైన్ ప్రాంతంలో శివార్చన వేదిక నిర్మాణం పనులు చేపట్టారు. దీనిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడానికి ఆలయ ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. శివార్చన వేదిక బేస్‌మెంట్ మొత్తం ఫ్లోరింగ్ నిర్మించి వెనుక భాగంలో కైలాస పర్వతం ఆకారంలో



నిర్మించడం, వేదిక వెనుక భాగంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా రెండు డ్రెస్సింగ్ గదుల ఏర్పాటుకు పనులు చేపట్టారు. ప్రస్తుతం బేస్‌మెంట్ వరకు మాత్రమే పనులు జరిగాయి. భారాస ప్రభుత్వ హయాంలో పనులు మొదలు పెట్టిన గుత్తేదారు ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో డైలామాలో పడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు ఎలా ఉంటాయోనన్న సందేహంతో పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో శివార్చన వేదిక నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాజన్న ఆలయ ఇంజినీరింగ్ అధికారులు సైతం గుత్తేదారు చేసిన పనులకు బిల్లులు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే ఇంకా విడుదల కాలేదు.

బిల్లులు విడుదల కావాల్సి ఉంది– రఘునందన్, డీఈ, రాజన్న ఆలయంరాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో నిర్మాణంలో ఉన్న శివార్చన వేదిక పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు దాదాపు రూ.50 లక్షల వరకు బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగింది. చేసిన పనులకు బిల్లులు విడుదల కావాల్సి ఉంది.

# నిర్వహణ ప్రధానం.. స్వచ్ఛత సాకారం



కరీంనగర్ : అత్యవసర సమయాల్లో మలమూత్ర విసర్జన చేసేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో పాటు బహిరంగ మలమూత్ర విసర్జన చేయకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించింది. వీటి నిర్వహణను పక్కాగా అమలు చేసేందుకు వీలుగా శుభ్రతను తనిఖీ చేయాలని నిర్ణయించింది.

జిల్లాలోని నగర, పురపాలికల పరిధిలో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో స్వచ్ఛత కార్యక్రమాలపై ఏటా తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య పనుల నిర్వహణతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ప్రాంతాల్లో ఉన్న మరుగుదొడ్ల వినియోగంపై సర్వే చేస్తున్నారు. ఆ సర్వే ఆధారంగా ర్యాంకుల ప్రకటన చేస్తుండటంతో పురపాలికలు సైతం వాటిపై దృష్టి సారించాయి. ఇప్పటికే పలు మున్సిపాలిటీలకు ఓడీఎఫ్, ఓడీఎఫ్‌ం, ఓడీఎఫ్‌ంం సర్టిఫికెట్లు అందాయి. అక్కడికే పరిమితం చేయకుండా మరో ఉద్యమాన్ని నిర్వహించేలా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. 'క్లీన్ టాయిలెట్ ఛాలెంజ్' పేరుతో సర్వే చేసేందుకు కార్యాచరణ తీసుకున్నారు.

మూడు విభాగాల్లో విభజన ఇప్పటికే ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లను గుర్తించి శుభ్రత తనిఖీ చేయాల్సి ఉంటుంది. వాటిలో నీటి సౌకర్యం, గాలి, వెలుతురు, ఇతర హంగులు పరిశీలించి గ్రౌండింగ్ చేయాల్సి ఉంటుంది.

ఒక్కో మున్సిపాలిటీలో 2026 సంవత్సరపు జనాభాను అంచనా వేసి దానికి అనుగుణంగా కొత్తగా నిర్మించాల్సి ఉంటుంది.

నిర్మాణ పనుల్లో అడ్డంకులు రావడం, నిధుల కొరత వంటివి ఉండి మధ్యలో ఆపేసిన వాటిని గుర్తించడం, పాత వాటిలో అదనపు హంగులు, రిపేర్లు వంటివి చేసుకునే వీలుంది.

ఈ అంశాలపై మార్కులు 5

సౌకర్యాల లభ్యత

తగినంత వెలుతురు, టాయిలెట్ల సీట్లలో నీటి సరఫరా, తలుపులకు తాళాలు వేసే వీలు, నీటి కనెక్షన్ వాష్‌బేసిన్.

అందుబాటులో..మహిళలకు, పురుషులకు వేర్వేరు దారులు, దివ్యాంగులకు సౌకర్యాలు, సులభ్ కాంప్లెక్స్ ఉన్నట్లు సైన్‌బోర్డులు.

శుభ్రత అన్ని టాయిలెట్ సీట్లు శుభ్రంగా ఉన్నాయా? డస్ట్‌బిన్ల ఏర్పాటు, కుళాయిల లీకేజీ కాకుండా ఉండటం

పర్యావరణ అనుకూలం

సోక్ పిట్, మురుగు వెళ్లే సెప్టిక్ ట్యాంకులకు అనుసంధానం ఉన్నాయా లేదా చూడటం, సురక్షితమైన డిస్పోజల్ మిషన్ ఉందా లేదా గుర్తించడం, అంతరాయం లేకుండా నీటి సరఫరా జరగడం.

సురక్షితమైనటాయిలెట్ ప్రాంగణం లోపల, వెలుపల భాగంలో సరైన కాంతి రావడం, పీపీఈ కిట్ ధరించిన వ్యక్తి కాపలా ఉండాలి, ఫిర్యాదులను నమోదు చేయాలి.

ఎంపిక చేసిన స్వశక్తి మహిళలతో సర్వే

'క్లీన్ టాయిలెట్ ఛాలెంజ్'లో భాగంగా నగరాలు, పట్టణాల్లో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లు, సాముహిక మరుగుదొడ్ల వివరాలను సేకరించాల్సి ఉంటుంది. మెప్మా ద్వారా గుర్తించిన స్వశక్తి సంఘాల సభ్యులకు ఈ మేరకు కరీంనగర్ నగరపాలికలో శిక్షణ కూడా ఇచ్చారు. నగరపాలికల్లో అయితే నలుగురు, మున్సిపాలిటీల్లో అయితే ఇద్దరు చొప్పున ఎంపిక చేశారు. వీరు స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్‌లో ప్రతీ సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్లి ఫొటోలు, 40 సెకన్ల నిడివి గల వీడియో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ సర్వే గత సోమవారం నుంచి ప్రారంభం కాగా నేటితో పూర్తి కానుంది.

# ఆర్అండ్ఆర్ గెజిట్ జాబితాకు ఎదురుచూపులు



బోయినపల్లి: అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు అందించాల్సిన ఆర్అండ్ఆర్ పరిహారం జాబితాపై నేటికీ ఉత్కంఠ వీడటం లేదు. మూణ్నెళ్ల క్రితం గ్రామంలో గ్రామ సభ నిర్వహించిన అధికారులు క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే జాబితాలోని పేర్లను చదివి వినిపించారు. దీనిపై పలువురు జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతోపాటు పేర్లు తొలగించాలని ఫిర్యాదులు చేయగా, మరికొంత మంది తప్పిపోయిన వారి పేర్లు చేర్చాలని కోరుతూ దరఖాస్తులను అధికారులకు అందించారు.

కాళేశ్వరం అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో భాగంగా బోయినపల్లి మండలం దేశాయపల్లిలో వరద కాలువకు అవతలి వైపు ఉన్న ఇళు ముంపునకు గురవుతున్నాయి. ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందించడంలో భాగంగా అధికారులు ఏడాదిన్నర క్రితం గ్రామంలో (సోషియో ఎకనామిక్ సర్వే) ఇంటింటి సర్వే నిర్వహించారు. నిర్వాసితుల నివాసం, వృత్తి ఇతర వివరాలు నమోదు చేసుకోవడంతోపాటు రేషన్, ఆధార్ కార్డు ఇతర ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిర్వహించిన సర్వే జాబితాపై పలు మార్లు గ్రామ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేయగా వాయిదా పడింది. నిర్వాసితులు కొంత మంది తమకు ఒకేసారి పరిహారం చెల్లింపులు చేయాలని (ఓటీఎస్, వన్‌టైం సెటిల్‌మెంట్) కోరగా మరికొంత మంది తమకు ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసి పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎవరికి వారు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఒక్కో నిర్వాసిత కుటుంబానికి 75 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.6.60 లక్షల పరిహారం, ఇంటి నిర్మాణానికి రూ.1.25 లక్షలు చెల్లిస్తామని అధికారులు వెల్లడించారు. ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఓటీఎస్ (వన్‌టైం సెటిల్‌మెంట్) పరిహారం కోరితే రూ.12 లక్షలు చెల్లిస్తామన్నారు. అయితే నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ కాలనీ కోసం భూసేకరణ చేయడానికి వరద కాలువ సమీపంలో 11 ఎకరాలు పీఎన్ (ప్రిలిమినరీ నోటిఫికేషన్) ప్రచురించారు.

వీడని ఉత్కంఠ

గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించిన అధికారులు 144 మంది నిర్వాసితులుగా మారుతున్నట్లు గుర్తించారు. గ్రామ సభలో జాబితా చదువుతున్న సమయంలో పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మొదటగా 119 మంది నిర్వాసితులతో జాబితా రూపొందించగా తర్వాత 133 మందితో రెండోది, అనంతరం 144 మందితో మూడో జాబితా తయారు చేయడంపై పలువురు ప్రశ్నించారు. అనర్హుల పేర్లు తొలగించాలంటూ అధికారులకు ఫిర్యాదులు వెళ్లగా, అదే సమయంలో అర్హుల పేర్లు తప్పిపోయినట్లు స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. నిర్వాసితుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులపై గ్రామంలో విచారణను అధికారులు పూర్తి చేశారు. విచారణ అనంతరం 141 మందితో తుది జాబితా సిద్ధమైనట్లు సమాచారం. తుది జాబితాను గ్రామ పంచాయతీలో ప్రచురించి గెజిట్ ప్రక్రియ పూర్తి చేసి తమకు రావాల్సిన న్యాయమైన పరిహారం త్వరితగతిన అందించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

తుది జాబితాకు చర్యలు– మధుసూదన్, ఆర్డీవో, వేములవాడ దేశాయపల్లిలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందించడంలో భాగంగా క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సర్వే జాబితాపై గ్రామ సభ నిర్వహించాం. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులపై విచారణ పూర్తి చేశాం. తుది జాబితాను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్హులందరికీ న్యాయం చేస్తాం.

# సమస్యలు తీరాలి.. రైతులు మురవాలి

చండూరు : నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సమస్యలు తిష్టవేశాయి. సరైన వసతులు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట ఉత్పత్తుల విక్రయానికి వచ్చే సమయంలో షెడ్లు, తాగునీరు, తదితర మౌలిక వసతులు లేక ఇక్కట్లు పడుతున్నారు. వానాకాలం సీజన్‌తోపాటు అకాల వర్షాలు కురిసినప్పుడు సరిపడా షెడ్లు లేకపోవడంతో పంటను కాపాడుకోలేకపోతున్నారు. భారీ వర్షాలు కురిస్తే కుప్పలు తడిసి ధాన్యం వరదలో కొట్టుకుపోతోంది. వేసవిలో రైతులు పొద్దస్తమానం ఎండలో కొనుగోళ్ల కోసం వేచి ఉండి ఇబ్బందులు పడుతున్నారు. తాగడానికి నీళ్లు లేక కొనుగోలు చేసి దప్పిక తీర్చుకుంటున్నారు.

అందని రూ.5కు భోజన పథకం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం 21 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటిలో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఐదు, నల్గొండలో పది, సూర్యాపేటలో ఆరు వ్యవసాయ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటిల్లో సరిపడా వసతులు లేక కర్షకులు నరకయాతన అనుభవిస్తున్నారు. గత ప్రభుత్వం మార్కెట్‌కు వచ్చే రైతులకు రూ.5కు భోజనం అందించాలని ఆదేశించింది. ఏజెన్సీలు ముందుకు రావడం లేదనే సాకుతో అధికారులు అమలు చేయలేదు. ప్రభుత్వం మారటంతో ఈసారైనా భోజన అమలు చేస్తారని రైతులు ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మార్కెట్ల పరిస్థితి ఇలా..భువనగిరి పాత మార్కెట్ యార్డులో షెడ్లు లేవు. సీసీ బెడ్లు కొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరాయి. కొత్త మార్కెట్ యార్డులో లావాదేవీలు జరగకపోవటంతో నిరుపయోగంగా మారింది.హుజూర్‌నగర్‌లో మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు జరగటం లేదు. ఇక్కడ మిల్లులు ఉండటంతో దీన్ని వినియోగించటం లేదు.నేరేడుచర్ల యార్డు ఆవరణలో పూర్తిస్థాయిలో సీసీ నిర్మించలేదు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి ఆవరణ బురదమయంగా మారుతోంది.తిరుమలగిరిలో సమీకృత మార్కెట్ నిర్మించారు. స్థలం సరిపోకపోవ డంతో నిర్వహణకు ఇబ్బందిగా మారింది. ఒక రోజు మార్కెట్ నిర్వహణ చేపడితే.. మరోరోజు సెలవు ఇవ్వాల్సి వస్తోంది.చిట్యాలలో వసతులు ఉన్నాయి. మార్కెట్ నిర్వహణ సజావుగా సాగుతో ంది.మిర్యాలగూడ పరిధిలోని అవంతీపురంలో నిజాం షుగర్స్ కర్మాగారానికి నిర్మించారు.

# ఆరోగ్యశాఖకు డబ్బుజబ్బు..

మంచిర్యాల : డబ్బు ఆశ చూపిస్తే .. ఆరోగ్యశాఖలో కిందిస్థాయినుంచి ఉన్నతాధికారి వరకు నిబంధనలకు విరుద్ధంగా ఏ పనిచేసేందుకైనా సిద్ధంగా ఉంటారని అనేకసార్లు నిరూపితమైంది. వైద్యారోగ్యశాఖలోని మూడు విభాగాల్లో(డీఎంఈ, టీవీవీపీ, డీహెచ్)నూ ఇదే తంతు. ఆయా కార్యాలయాల్లో పనిచేసే చాలామంది ఇతర ప్రాంతాల్లో ఉంటూ వారంలో రెండు, మూడురోజులు హాజరవుతారు. అడిగితే ఉన్నతాధికారుల చేతులు తడుపుతారు. వీరుసైతం ఇదే తీరుగా చేస్తుండటంతో ఒకరికొకరు సర్దుకుపోతుంటారు. కార్యకలాపాలు వాయిదా వేస్తూ బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తుంటారు.

పట్టిపీడిస్తున్నారు..ఆరోగ్యశాఖలో అద్దె ప్రాతిపదికన వాహనాల కేటాయింపు దగ్గర నుంచి బిల్లుల చెల్లింపు వరకు లంచం ఇవ్వకుంటే యజమానుల పనులు కావడం లేదు. ఉద్యోగ ప్రకటనల అనంతరం ఎంపికైన అభ్యర్థుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. లేదంటే సరైన పత్రాలు సమర్పించలేదంటూ పక్కన పెడుతున్నారు. గతంలో వైద్యకళాశాలకు సంబంధించిన నియామకాల్లో జీజీహెచ్‌లోని ఓ ఉద్యోగి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు రావడంతో పాలనాధికారి ప్రక్రియ నిలిపివేసి చివరకు ఓ ఏజెన్సీకి అప్పగించారు. ఇలాంటి ఉదాహరణలు ప్రస్తుత డీఎంఈ, డీహెచ్ జిల్లా కార్యాలయాల్లో అనేకం ఉన్నాయి. బాధితులు ముందుకురావడంతోపాటు ఏసీబీ నిఘా పెడితే మరింత మంది బయటపడే అవకాశముంది.

నిర్మల్‌లో రూ. 8 వేలు లంచం తీసుకుంటూ..

ఆరోగ్యశాఖ అధికారులు విశ్రాంత ఉద్యోగులను సైతం వదలడం లేదు. గతేడాది నిర్మల్ జిల్లాలో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు చెందిన ఓ ఉద్యోగి.. మెడికల్ రియంబర్స్‌మెంట్ మంజూరుకు డబ్బులు డిమాండ్ చేశారు. బాధిత వ్యక్తి ఏసీబీని సంప్రదించారు. చివరకు రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుపడ్డారు.

నిధుల దుర్వినియోగంపై..

ఆరోగ్యశాఖ అధికారులు.. ఇతరుల దగ్గర నుంచి లంచం తీసుకోవడమే కాకుండా శాఖ నిధులు దుర్వినియోగం చేయడంలోనూ ముందుంటున్నారు. గతంలో మంచిర్యాల జిల్లా శాఖకు చెందిన ఓ ఇద్దరు అధికారులు.. ఆరోగ్య సిబ్బందికి ఇచ్చే శిక్షణలో భాగంగా భోజన ఖర్చులు చూపెట్టి సుమారు రూ.లక్షన్నర స్వాహా చేశారు. కానీ ఈ ఘటనలో బలైంది ఓ స్టాఫ్‌నర్సు అని ఇటీవలే తేలింది. సొమ్మును హోటల్ నిర్వాహకుల నుంచి ఆమె ఖాతాలో జమ చేయించి నగదు రూపంలో తీసుకోగా చివరకు ఆమె మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. ఈనెల మొదటి వారంలో ఆ ఉద్యోగిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు కూడా వచ్చాయి.

రూ.10 వేలకు ముగ్గురి పోటీ.. ఏసీబీకి చిక్కి..

నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన బిల్లుల్లోనూ అవినీతికి పాల్పడుతున్నారు. డబ్బుకోసం ఒత్తిడి తెస్తూ చివరకు ఏసీబీకి చిక్కుతున్నారు. ఇటీవల మంచిర్యాల వైద్యారోగ్యశాఖలో రూ.10 వేలకు కక్కుర్తితో ముగ్గురు పోటీపడి బలయ్యారు. ఇందులో ఇద్దరు పొరుగుసేవల ద్వారా విధులు నిర్వహిస్తుండగా మరొకరు శాశ్వత ఉద్యోగి.

అవినీతిమయంగా జిల్లా వైద్యారోగ్యశాఖ..

జిల్లా కార్యాలయంలోని శాశ్వత ఉద్యోగులతో పాటు ఎన్‌హెచ్‌ఎం కింద పనిచేస్తున్న సిబ్బందిలో చాలామంది అవినీతిపరులనే ఆరోపణలు వస్తున్నాయి. కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు లంచాలకు కక్కుర్తి పడుతున్నారని శాఖలోని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. పనికోసం వస్తే శాఖకు సంబంధించిన ఉద్యోగిని సైతం వదలలేదంటున్నారు. వేతనాల చెల్లింపులు, శాఖాపరమైన ఖర్చులు ఇచ్చేందుకు సైతం ఇక్కడి సిబ్బంది చేతులు చాస్తున్నారు. ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డ ముగ్గురితోపాటు మరో ఇద్దరిది నిత్యం ఇదే పని అంటూ లావాదేవి విషయంలో అనేకసార్లు కార్యాలయంలోనే గొడవపడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా జిల్లా అధికారి పట్టించుకోకపోవడం, పర్యవేక్షణ అంతంత మాత్రమే చేస్తుండటంతో ఆయా వ్యక్తులను ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# చిరిగిన సంచి.. తూకం పేచీ

మంచిర్యాల : పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంపిణీ చేసే రాయితీ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇప్పటికే చౌకధరల దుకాణాల వద్దనే దళారులు లబ్ధిదారుల నుంచి నేరుగా కొని మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా నాసిరకం గోనె సంచులు వాడటంతో అవి చిరిగి సగం బియ్యం నేలపాలవుతున్నాయి. ఆ చిరిగిన సంచులను తూకం వేయకుండానే డీలర్లకు సరఫరా చేస్తున్నారు. ఒక్కో బస్తాకు ఒకటి నుంచి అయిదు కిలోల వరకు బియ్యం తగ్గుతుందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలో ఆరు మండల గిడ్డంగులు ఉన్నాయి. వీటిలో డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారులను ఇన్‌ఛార్జిగా నియమించాల్సి ఉంది. నస్పూరులోని మంచిర్యాల గిడ్డంగిలో ఎనిమిది నెలలుగా ఇన్‌ఛార్జి పోస్టు ఖాళీగా ఉండటంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగితో కొనసాగిస్తున్నారు. ఆ గోదాంలో ఇప్పుడే విద్యుత్తు వైరింగ్ చేస్తున్నారు. కరెంటు లేక తూకం వేసే కాంటా నిరుపయోగంగా ఉంది. తూకం వేయకుండాం సంచుల్లో సరఫరా చేయడంతో డీలర్లు నష్టపోతున్నారు. చర్యలేవి?నస్పూరులోని మండల గిడ్డంగి నుంచి మంచిర్యాల, మందమర్రి, జైపూర్, హాజీపూర్, నస్పూరు మండలాల్లోని చౌకధరల దుకాణాలకు రాయితీ బియ్యం సరఫరా చేస్తారు. ఈ గిడ్డంగి ద్వారా నెలకు దాదాపు 1,260 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతి నెలా 20 నుంచి మరుసటి నెల 5వ తేదీలోపు లారీల ద్వారా రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5 కిలోలు, రాష్ట్రం ఇచ్చే ఒక కిలో బియ్యం కలిపి మొత్తం ఆరు కిలోలు ఉచితంగా ఒక్కో లబ్ధిదారునికి పంపిణీ చేస్తున్నారు. ప్రధాన గిడ్డంగుల నుంచి బియ్యం ఆలస్యంగా వచ్చినప్పుడు, వాటిని రేషన్ దుకాణాలకు తరలించడానికి అవసరమైన లారీల కొరతతో అప్పుడప్పుడు పంపిణీలో జాప్యమవుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం తీసుకున్న లబ్ధిదారులు, కొన్ని దుకాణాల్లో అక్కడే సిద్ధంగా ఉన్న దళారులకు కిలోకు రూ.15 చొప్పున అమ్ముతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

ఎస్‌డబ్ల్యూసీ (స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్) గోదాం నుంచి వచ్చిన బియ్యం బస్తాలను నిబంధనల ప్రకారం.. ముందుగా నస్పూరులోని మండల గిడ్డంగిలో తూకం వేసి భద్రపర్చాలి. ఆ తర్వాత మళ్లీ రేషన్ దుకాణాలకు తూకం వేసి పంపించాలి. ఇందుకోసం ఒక క్వింటాలుకు రూ.26 చొప్పున హమాలీ ఛార్జీ చెల్లిస్తారు. నస్పూరులో ప్రధాన గోదాం నుంచి వచ్చిన బియ్యం తూకం వేయకుండానే ఆ లారీలో నుంచి నేరుగా మరోదానిలో లోడింగ్ చేసి ఒకేసారి రెండు మూడు రేషన్ దుకాణాలకు పంపిస్తున్నారు. తూకం వేయకుండానే చిరిగిన సంచుల్లో బియ్యం సరఫరా చేయడంతో డీలర్లకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది.

రేషన్ దుకాణాలకు సరఫరా చేయడానికి నస్పూరులోని మండల గిడ్డంగిలో నిలువ ఉంచిన బియ్యం బస్తాలివి. కొన్ని చిరిగినవి ఉండటంతో మధ్య మధ్యలో ఇలా బియ్యం పడిపోతున్నాయి. బస్తాలు మళ్లీ లోడింగ్ అన్‌లోడింగ్ చేసేటప్పుడు మరింత చినిగి నేలపాలవుతున్నాయి.గతేడాది పాత మంచిర్యాలలో మండల గిడ్డంగి ఏర్పాటు చేసినప్పుడు దాదాపు 600 టన్నుల రేషన్ బియ్యాన్ని, అందులో పనిచేసే ఇన్‌ఛార్జి గోల్‌మాల్ చేసినట్టు టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. ఆ గోదాం ఇన్‌ఛార్జిని సస్పెండ్ చేశారు. గోదాంలో తగ్గిన బియ్యంపై ఇప్పటి వరకు పౌర సరఫరాల శాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి మిగతా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

# జనవాణి కాలుష్య నివారిణి

హైదరాబాద్ : కాలుష్య కట్టడికి పీసీబీ ఆవిష్కరించిన 'జనవాణి – కాలుష్య నివారిణి' యాప్‌కు విశేష స్పందన లభిస్తోంది. గ్రేటర్ పరిధిలో రోజూ పదుల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని.. సత్వర పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదులు చేయడాన్ని సులభతరం చేయడంతోపాటు కాలుష్యం కలిగించే వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేలా వెసులుబాటు కల్పించడంతో నియంత్రణ సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కోటిన్నర జనాభా ఉన్న నగరంలో జల, శబ్ద, వాయు కాలుష్యం పరిమితి ఏటా పెరుగుతోంది. కంటికి కనబడని సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 10, పీఎం 2.5 స్థాయిలు పెరిగి సున్నిత వ్యక్తులు అనారోగ్యం పాలవుతున్నారు. ఇక రెస్టారెంట్లు, పరిశ్రమల ఉద్గారాలు, బహిరంగ చెత్తదహనం, రసాయన వ్యర్థాలను ఆరుబయట పారబోయడం తదితరాలను కట్టడి చేసేలా నిఘా లేకపోవడంతో నియంత్రణ కష్టతరమవుతోంది. దీంతో పౌరుల భాగస్వామ్యంతోనే నియంత్రణకు ఆస్కారం ఉంటుందని భావించిన అధికారులు 'జనవాణి – కాలుష్య నివారిణి' యాప్ రూపకల్పన చేశారు.




యాప్, వెబ్‌సైట్ లంకెలు... పీసీబీ అధికారిక వెబ్‌సైట్ %https://telangana-ccr.glensserver.com/#/complaints% ను సందర్శించి నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. లేదా ఆండ్రాయిడ్ ఫోన్‌లో %https://play.google.com/store/apps/details?id=com.tspcb&pli%=1 లంకెను క్లిక్ చేసి ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఎలా ఫిర్యాదు చేయాలి?

అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌లో కంప్లైంట్ ఎంట్రీ విభాగానికి వెళ్లి కేటగిరిలో జల, శబ్ద,వాయు కాలుష్యాలు, ఘన వ్యర్థాల పారబోత, మురుగు, ట్రాఫిక్ రద్దీతో ఏర్పడే కాలుష్యం, పరిశ్రమల ఉద్గారాలు, పారిశ్రామిక వ్యర్థాల పారబోత, రివర్స్‌బోరింగ్, బహిరంగంగా చెత్త కాల్చడం, రోడ్డుపై రేగే దుమ్ము, అధ్వాన రోడ్లతో కాలుష్యం, జనరేటర్ల కాలుష్యం, నిర్మాణరంగంలో వెలువడే కాలుష్య ఉద్గారాలపై ఫిర్యాదు చేయొచ్చు.కాలుష్య ప్రదేశం వివరాలు, ఫిర్యాదుదారు పేరు, మొబైల్ నంబరు, ఈమెయిల్‌ఐడీ నమోదు చేయాలి.

కాలుష్య సమస్యపై 100 పదాల్లో వివరించవచ్చు. ఫొటోలు, ఇతర వివరాలను పోస్టు చేయొచ్చు. ఫిర్యాదులు స్వీకరించిన టాస్క్‌ఫోర్స్ బృందం చోట్ల తనిఖీలుజరిపి నివేదికతో చర్యలు తీసుకుంటుంది.

# కంప్యూటర్లొచ్చాయి.. బోధనే తరువాయి




తాండూరు : ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం ఎంతో అవసరం. ఇందుకు అనుగుణంగా విద్యాశాఖ సమగ్రశిక్షా అభియాన్ ద్వారా పాఠశాలలు, మండల రిసోర్సు కేంద్రాలకు (ఎమ్మార్సీ) ప్రత్యేకంగా కంప్యూటర్లు మంజూరయ్యాయి. ఇవి ఆయా జిల్లా కేంద్రాలకు రాగా ఇప్పటికే ఎమ్మార్సీలకు సరఫరా చేశారు. త్వరలోనే పాఠశాలలకు రానున్నాయి. కంప్యూటర్‌తో పాటు ప్రింటర్లు, 2 కేవీఏ యూపీఎస్, ఎంఎస్ ఆఫీస్ సాఫ్ట్‌వేర్, స్విచ్ బోర్డులు, కేబుల్ వైర్, జాక్ ప్యానెల్ సామగ్రిని అందిస్తున్నారు. వీటిని త్వరలోనే ఎమ్మార్సీలు, పాఠశాలల్లో అమర్చనున్నారు.

పాత మండలాలకే..: ఉమ్మడి మెదక్‌తో పాటు వికారాబాద్ జిల్లాలోని పాతమండలాల ఎమ్మార్సీలకు మాత్రమే ఈ కంప్యూటర్‌లను సరఫరా చేశారు. కొత్త మండలాల్లో ఇంకా ఎంఈవో, సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. ప్రస్తుతం కార్యకలాపాలు పాత ఎమ్మార్సీలతోనే నిర్వహిస్తున్నారు. ఈ ఎమ్మార్సీలలో పాతవి రెండు, మూడు మాత్రమే ఉన్నాయి. ఇవి సక్రమంగా పని చేయటంలేదు. వివరాలు నమోదు చేయటంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాప్యం జరుగుతోంది. దీనిని గుర్తించిన విద్యాశాఖ ప్రతి ఎమ్మార్సీకి ఆరు చొప్పున మంజూరు చేసింది. వీటి ఏర్పాటువల్ల సీఆర్పీలు వారి పరిధిలోనే సర్వే వివరాలను నమోదు చేసుకునే వీలుంది. నాలుగు జిల్లాల్లోని ఎమ్మార్సీలకు 408 సరఫరా అయ్యాయి. పాఠశాలలకు 2,382 కంప్యూటర్లు ఇస్తున్నారు.

మరమ్మతులతో మూలకు..2006లో విద్యాశాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఇచ్చేవారు. కంప్యూటర్ల కోసం పాఠశాలలకు విద్యుత్తు సౌకర్యం కల్పించారు. గతంలో కొన్ని కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. మరికొన్ని చోట్ల మరమ్మతులు చేయలేక మూలన పెట్టారు. గతంలో సాంకేతిక విద్యా బోధన ప్రారంభించినా తర్వాత నిలిచిపోయింది. బోధకులు లేక, కంప్యూటర్లు సరిగా లేక ఆగింది. ప్రస్తుతం 100 లోపు విద్యార్థులు ఉంటే ఐదు కంప్యూటర్లు, 101–200 ఉంటే 8... 201 ఆపై ఉంటే 10 అందిస్తున్నారు. విద్యాశాఖ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలకు కంప్యూటర్లు సరఫరా చేయటంతో ప్రతి విద్యార్థి నేర్చుకునేందుకు దోహదం కానుంది. ఎలాంటి ఖర్చు లేకుండానే వారికి మేలు జరగనుంది. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకూ కంప్యూటర్లను సరఫరా చేస్తున్నారు. బాలికలు సాంకేతిక విద్యలో నైపుణ్యం సాధించనున్నారు.

సాంకేతిక విద్యలో ముందడుగు: రేణుకా దేవి, డీఈవో

జిల్లాలో ఉన్న ఎమ్మార్సీలతో పాటు ఎంపిక చేసిన పాఠశాలలకు కంప్యూటర్లు వచ్చాయి. ఎమ్మార్సీలకు సరఫరా చేశాం. పాఠశాలలకు కూడా పంపిణీ చేస్తున్నాం. వీటితో విద్యార్థులకు సాంకేతిక విద్యపై ముందడుగు పడనుంది. అవగాహనతో ఎంతో మేలు జరగనుంది. త్వరలో కంప్యూటర్లను బిగిస్తాం.

# అధ్వాన దారులు.. అవస్థలతో రాకపోకలు

తాండూరు: రహదారుల నిర్వహణ సక్రమంగా లేక ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. తాండూరు నుంచి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు రాకపోకలకు వీలుకాక నానా అవస్థలు పడుతున్నారు.

వికారాబాద్ నియోజక వర్గం పరిధిలోకి వచ్చే బంట్వారం మండలం బొపునారం గ్రామం రాష్ట్ర సరిహద్దుగా ఉంది. ఈ గ్రామం నుంచి మూడు కిలో మీటర్ల దూరం వెళితే కర్ణాటక రాష్ట్రంలోని కుంచవరం గ్రామం వస్తుంది. అయితే కుంచవరం గ్రామానికి అనుసంధానమయ్యే బొపునారం రోడ్డు పూర్తి అధ్వానంగా ఉంది. గ్రామంలోని కంపోస్టు యార్డు నుంచి పల్లెప్రకృతి వనం వరకు కిలో మీటరు పైగా తారు తొలగి గుంతలు పడింది. మరి కొంత దూరం పూర్తిగా మట్టిరోడ్డుగా



మారి పోయింది. రెండేళ్లకు పైగా నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. రాకపోకలకు వీలుకాక వాహనాలు దెబ్బతింటున్నాయి.ఏవీ పనులు..: ఇక జహీరాబాద్ రహదారి మార్గంలోనే పెద్దేముల్ మండలం ఇందూరు గ్రామం వద్ద ప్రధాన రహదారి పూర్తిగా రాళ్లు తేలింది. తాండూరు నుంచి తొర్మామిడి వరకు రూ.18 కోట్ల వ్యయంతో నిర్మించే రహదారి విస్తరణలో భాగంగా ఇందూరు గ్రామం వద్ద పనులు చేపట్టలేదు. వర్షాకాలంలో మోకాలు లోతు గోతుల మయంగా మారిన రహదారిపై రాకపోకలు సాగించినప్పుడు అవస్థలు పడ్డారు. వర్షాలు ఆగిపోయిన తర్వాత రహదారులు భవనాల శాఖ సిబ్బంది తాత్కాలిక ఉపశమనం కోసం గుంతల్లో మట్టిని పోయించారు.మట్టి కాస్త తొలగి పోయి మళ్లీ గుంతల మయంగా మారింది. వాహనాలు వెళ్లేపుడు పాట్లు తప్పడం లేదు. అడ్డదిడ్డంగా మారిన రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# యాసంగికి సన్నద్ధం



వికారాబాద్: యాసంగి సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖకు నివేదికను కూడా పంపించారు. జిల్లాలో ప్రస్తుత యాసంగిలో 1.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నారని అధికారులు అంచనా వేశారు. నీటి వసతి ఆధారం చేసుకుని పంటలు చేపడుతున్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం ఎంత? ఏయే పంటలు వేస్తారు, విత్తనాలు, ఎరువుల లభ్యత తదితర వివరాలతో ప్రణాళిక రూపొందించారు.

పూర్తిగా గ్రామీణ నేపథ్యం

వికారాబాద్ జిల్లా పూర్తిగా గ్రామీణ నేపథ్యం. పరిగి కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలుండగా ఉదయం లేచింది మొదలు కుటుంబాలు పొలం పనుల్లోనే నిమగ్నమై ఉంటాయి. రెండేళ్లుగా జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, చిన్ననీటి వనరులు, బావులు, బోర్లలో నీళ్లు ఉండటంతో రైతులు యాసంగిలో పంటల సాగుకు సిద్ధమయ్యారు.

260 మంది డీలర్లు

జిల్లాలోని 260 మంది ఎరువులు, విత్తనాల డీలర్లు ఉన్నారు. యాసంగి సాగుకు 28,293 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం ఉంది. వీటిలో యూరియా 11,387, డీఏపీ 6,100, కాంప్లెక్స్ 6,787, ఎన్ఓపీ 2,321, ఎస్ఎస్‌పీ 1,695 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. విత్తనాలపై రాయితీ ఎత్తి వేయడంతో అన్ని ఎరువుల దుకాణాల్లో లభించనున్నాయి. ఎకరా వరి సాగుకు అవసరమయ్యే నీటితో నాలుగు ఎకరాల ఆరుతడి పంటలను సాగు చేయవచ్చు.

వరికి బదులుగా..

ఇప్పటికే బియ్యం నిల్వలు పేరుకుపోయి ఉండటం, వరికి అధిక నీరు, విద్యుత్తు అవసరం కావడంతో ఆదా చేయడానికి వరిసాగు అధిక విస్తీర్ణంలో సాగు చేయవద్దని అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వరి స్థానంలో ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు చేసేలా వ్యవసాయాధికారులు కార్యాచరణ రూపొందించారు.

క్లస్టర్ల వారీగా సమావేశాలు

జిల్లాలోని 97 రైతు వేదికల్లో క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించి రైతులకు వివిధ వాణిజ్య, సంప్రదాయ పంటలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఆరుతడి పంటలైన వేరుసెనగ, పొద్దుతిరుగుడు, ఆవాలు, నువ్వులు, కుసుమలు, ఆముదం, శనగ, పెసర, మినుము, బొబ్బర్లు, ఇతర కూరగాయ పంటల వైపు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఆరుతడి పంటల సాగుతో ఖర్చు, ఎరువుల వినియోగం, చీడపీడల ఉధృతి తగ్గుతుంది. తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగు, నేలలో భూసారం పెరగడం, డిమాండ్‌కు అనుకూలంగా పంటలను ఎక్కడైనా అమ్ముకునే వెసులుబాటు ఉంటుందని వివరిస్తున్నారు.

సలహాలు, సూచనలు అందిస్తాం..: గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో 4 ఏడీలు, 17 మంది ఏఓలు, క్లస్టర్‌కు ఏఈఓ చొప్పున 97 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. గతంలో ఖాళీల కొరతతో పూర్తి స్థాయిలో సేవలు అందించకపోయి ఉండవచ్చు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తాం.

# మరమ్మతులు మృగ్యం.. నీరున్నా నిష్ఫలం

వికారాబాద్ : వికారాబాద్ పట్టణ ప్రజలకు కేవలం తాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన శివసాగర్ చెరువు నిర్వహణ సక్రమంగా లేక నీరంతా వృథా అవుతోంది. దశాబ్దాలుగా దీని గురించి పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారు. గతం సంగతి ఎలా ఉన్నా ప్రస్తుత ప్రభుత్వంలోనైనా ఈ చెరువు పర్యవేక్షణ, మరమ్మతుల గురించి పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరేళ్ల క్రితం వరకు ఆధారం ఆరు సంవత్సరాల క్రితం వరకు పట్టణ ప్రజలకు తాగునీటిని శివసాగర్ చెరువు ద్వారానే సరఫరా చేసేవారు. మిషన్ భగీరథ నీటి రాకతో చెరువు అవసరం తగ్గింది. భగీరథ నీటిని సరఫరా చేయకముందు పట్టణానికి నల్లాల ద్వారా 4.26 ఎం.ఎల్.డీల నీటిని సరఫరా చేయగా ఇందులో 2.44 ఎం.ఎల్.డీ నీటిని శివసాగర్ చెరువు ద్వారానే పంపిణీ చేసేవారు.

మినీ ట్యాంక్‌బండ్ ఏమైందో..

శివసాగర్ చెరువును అందంగా తీర్చిదిద్ది మరో మినీ ట్యాంక్ బండ్‌గా మార్చటానికి పుష్కలంగా అవకాశాలున్నాయి. గతంలో భారాస ప్రభుత్వం దీనికి సంబంధించి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. కానీ అది హామీలకే పరిమితమైంది. అనంతగిరి కొండలను చూడటానికి వచ్చిన పర్యాటకులు ఈ చెరువు అందాలను ఆస్వాదిస్తున్నారు. ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది చెరువు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో అధునాతనమైన పార్కును ఏర్పాటు చేయాలి. నీటిలో బోటింగ్ సౌకర్యాన్ని కల్పించాలి.

కట్టను వెడల్పు చేయాలి. ఈ కట్టమీది నుంచి బురంతపల్లి గ్రామ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వెడల్పు చేస్తే రాకపోకలకు మరింత అనుకూలంగా ఉంటుంది. కట్టపై విద్యుత్తు దీపాలు అమర్చాలి.

1969లో నిర్మాణం: 1969లో శివసాగర్ చెరువును నిర్మించారు. హైదరాబాద్–వికారాబాద్ రోడ్డు మార్గం పక్కనే ఈ చెరువును ఉంది. కట్ట ఎత్తు 26 అడుగులు. కట్ట పొడవు అర కిలో మీటరు, వైశాల్యం 179 ఎకరాలు. చెరువు నీటి పరివాహక ప్రాంతం అంతా పూడూరు, మన్నెగూడ, వికారాబాద్ మండలం పరిధి ప్రాంతం నుంచే వస్తుంది. మండలంలో వర్షం బాగా కురిస్తే చెరువు నిండిపోతుంది.

పూడికతీతకు రూ.15.70 కోట్ల మంజూరు

చెరువు పూడిక తీత, అభివృద్ధి కోసం 2013లో రూ.15.70కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.5 కోట్ల విలువ గల పూడిక తీత పనులు మాత్రమే పూర్తి చేశారు.

పట్టణ ప్రణాళికాధికారుల దృష్టికి తెస్తా– జాకీర్ అహ్మద్, కమిషనర్ వికారాబాద్ శివసాగర్ చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురైన విషయం తెలియదు. ఈ విషయాన్ని పట్టణ ప్రణాళికాధికారుల దృష్టికి తెస్తాను. భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినప్పుడు ఈ చెరువు నీటిని సరఫరా చేస్తున్నాం.

# మెట్రోలో సరికొత్త మైలురాళ్లు

హైదరాబాద్ : మెట్రోరైలు రోజువారీ తన కార్యకలాపాల నిర్వాహణకు అవసరమైన విద్యుత్తులో పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి చాలావరకు సమకూర్చుకుంటోంది. మెట్రోరైలు బ్రేక్ వేయడం ద్వారా, స్టేషన్లు, డిపోలపైన సౌర పలకల ద్వారా కరెంట్ ఉత్పత్తి చేసి వినియోగిస్తోంది. హైదరాబాద్ మెట్రో అందుబాటులోకి వచ్చి ఆరేళ్లు పూర్తిచేసుకుంది. పర్యావరణహిత విద్యుదుత్పాదన లోనూ ముందుంది. మెట్రో ఆపరేషన్స్, స్టేషన్లు, డిపోల నిర్వహణకు అవసరమయ్యే కరెంట్‌లో 30 శాతం వీటి నుంచి వినియోగించుకుంటోంది.బ్రేకింగ్ వ్యవస్థతో.. : మన మెట్రోలో రీజనరేటివ్ బ్రేకింగ్ వ్యవస్థ ఉంది. దీని ప్రత్యేకత ఏంటంటే ప్రతి స్టేషన్‌లో మెట్రో ఆగేందుకు బ్రేక్ వినియోగించినప్పుడు కరెంట్ ఉత్పత్తి అవుతుంది. ఇది తిరిగి ట్రాక్షన్ లైన్‌లో గ్రిడ్‌కు అనుసంధానం అవుతుంది. ఈవిధంగా ఆరేళ్లలో 36 మిలియన్ యూనిట్ల కరెంట్‌ను ఉత్పత్తి చేసింది. స్టేషన్లు, డిపోలపై సౌర పలకలు : మెట్రోరైలు నెట్‌వర్క్‌లో భాగంగా నిర్మించిన ఉప్పల్, మియాపూర్ డిపోలతోపాటు కిలోమీటర్‌కు ఒకటి చొప్పున మొత్తం 24 స్టేషన్లు ఉన్నాయి. థర్డ్‌పార్టీ ఒప్పందంతో సౌర విద్యుత్తు పలకలు ఏర్పాటు చేసింది. ఆరేళ్లలో వీటి నుంచి 11 మిలియన్ యూనిట్ల కరెంట్‌ను ఉత్పత్తి చేసింది.



# కొత్త రేషన్‌కార్డుల జారీపై ఆశలు

హుజూరాబాద్ : రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈనెల 28 నుంచి అర్జీల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతుండటంతో ఏళ్ల తరబడి ఆశగా ఎదురుచూస్తున్న వారికి ఊరట లభించనుంది. ఆరు గ్యారంటీలతోపాటు ఇతర సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపికకు రేషన్‌కార్డులు ప్రామాణికం కావచ్చనే భావన వినిపిస్తోంది. త్వరలో కొత్త కార్డుల జారీ ప్రక్రియకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

నిరీక్షణకు తెర...

ఏళ్ల తరబడి ఎదురుచూసినా కార్డులు జారీ కాకపోవడంతో అనేక కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధి పొందలేకపోతున్నాయి. వివాహమై వేరు కాపురం పెట్టిన దంపతులు కార్డులకు నోచుకోలేకపోయారు. పదేళ్లలో జన్మించిన పిల్లల పేర్లు కార్డుల్లో చేర్చలేదు. పెళ్లయిన యువతులు మెట్టింటి రేషన్‌కార్డులో నమోదుకు పుట్టింటి కార్డు నుంచి పేరు తొలగించుకున్నారు. ఇలాంటి వారికి రేషన్ సరకులతోపాటు ప్రభుత్వ పథకాలు అందకుండాపోయాయి. ప్రధానంగా ఆరోగ్యశ్రీ పథకం వర్తించక పేదలు వైద్యం కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. వేలాది మంది దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు ఆసరా పింఛన్లు అందక తీవ్రంగా నష్టపోతున్నారు.

రెండేళ్ల కిందట ఇలా..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భానికి ముందు ఉమ్మడి జిల్లాలో చివరిసారిగా రేషన్‌కార్డులు ఇచ్చారు. 2014లో పాత రేషన్‌కార్డుల నంబర్ల స్థానంలో కొత్త నంబర్లు కేటాయించి నూతన రాష్ట్ర ప్రభుత్వం పేరిట కుటుంబ




సభ్యుల వివరాలతో పత్రాలు జారీ చేశారు. ఇప్పటికీ ఆ పత్రాలనే తీసుకెళ్లి రేషన్ దుకాణాల్లో సరకులు తీసుకుంటున్నారు. 2021 జూన్ వరకు దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం అరకొరగా జారీ చేసి.. ఆ తర్వాత వెబ్‌సైట్‌ను మూసివేసింది. కనీసం మార్పులు, చేర్పులకు కూడా అవకాశం లేకుండాపోయింది. మూడేళ్లుగా ఇదే పరిస్థితి. తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లి రాతపూర్వకంగా ఇచ్చిన దరఖాస్తులన్నీ బుట్టదాఖలే అయ్యాయి.

సంక్షేమ పథకాల అమలుకు..

సంక్షేమ పథకాల అమలుకు రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 28 నుంచి రూ.500 సిలిండరుకు దీనినే ప్రామాణికంగా తీసుకోవాలని చర్చకు వచ్చింది. ఇప్పటి వరకు కార్డులేని అర్హులకు... వారికి వచ్చిన తర్వాత వర్తింపజేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. అర్జీల స్వీకరణ ప్రారంభించి గ్రామ, బస్తీసభలతో లబ్ధిదారులను ఎంపిక చేసేలా కార్యాచరణ రూపొందించింది. మూడేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీకి, చేర్పులు, మార్పులకు అవకాశమివ్వడంతో ఆరు గ్యారంటీల్లోని రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ.2,500, సన్నబియ్యం పంపిణీ, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా, ఉచిత విద్యుత్తు, రూ.500కే గ్యాస్ సిలిండరు తదితర పథకాలు అందుతాయనే ఆశతో అనేక కుటుంబాలు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నాయి.

లక్షల సంఖ్యలో అర్హులు..

ఉమ్మడి జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన రేషన్‌కార్డులు (ఆహార భద్రత) 9,78,665 వరకు ఉండగా 28,15,909 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా 17,974.614 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ అవుతోంది. వీరితోపాటే 2021 జూన్ వరకు రేషన్ కార్డుల కోసం 1,10,139 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటితోపాటు మీసేవా కేంద్రాల్లో వెబ్‌సైట్ ప్రారంభమైతే వేల సంఖ్యలో అర్జీలు చేసుకునే అవకాశముంది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల అర్జీలు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# ఉత్తమ బోధన.. టాస్క్ శిక్షణ

వేములవాడ : నాణ్యమైన విద్యా బోధన, మౌలిక వసతులు, టాస్క్ శిక్షణతో సాధిస్తున్న ఉత్తమ ఫలితాలే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు తెచ్చిపెట్టాయి. వేములవాడ- సిరిసిల్ల పట్టణాల మధ్య అగ్రహారంలో 1979లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్థాపించిన మొట్ట మొదటి శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దింది. ఇక్కడ విద్యనభ్యసించిన వేలాది మంది విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. చాలా మంది పూర్వ విద్యార్థులు వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ ఏటా వివిధ కోర్సుల్లో 420 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశం ఉంది. నిత్యం విద్యార్థులతో కళకళలాడుతూ, ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

**అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు**

పూర్వ విద్యార్థులు, దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నవారు కళాశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు. కళాశాలలో ఐదు విభాగాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఏటా రూ.5 వేల చొప్పున నగదు అందజేస్తున్నారు. పూర్వ విద్యార్థులు తమ ఉన్నత విద్యలో, ఉపాధి పొందడంలో, ఉద్యోగాల్లో తమ అనుభవాన్ని కళాశాల ఏర్పాటు చేసిన వేదిక 'అలుమ్ని టాక్స్' కార్యక్రమం ద్వారా ప్రస్తుత విద్యార్థులకు వివరిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

**నిపుణులైన అధ్యాపకులు...**




కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో 80 మంది నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు. వీరు విద్యా బోధన చేస్తూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. కొత్త ఢిల్లీ నుంచి వచ్చిన ఎన్‌బీఏ నిపుణులు నలుగురు మార్చి 24 నుంచి 26 వరకు సందర్శించారు. కళాశాలలోని వాతావరణం, మౌలిక వసతులు, ప్రయోగశాలలు, విద్యా బోధన, బాలురు, బాలికలకు వసతి గృహాలు, విద్యా ప్రమాణాలు, టాస్క్ శిక్షణ, ఉత్తీర్ణత శాతం, ఉద్యోగ కల్పన, ప్రాంగణ నియామకాలు, అదనపు బోధన ప్రణాళికలు, పూర్వ విద్యార్థుల సంఘం అందిస్తున్న సహాయ సహకారాలు వంటి పలు అంశాలను బృందం పరిశీలించింది. వాటన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందున కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఎన్‌బీఏ గుర్తింపు పొందిన ఈ పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన వారికి ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడటానికి అవకాశం ఉంటుంది.

**కోర్సులు ఇవీ...**

అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమాలో 120 సీట్లు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విభాగంలో 120, మెకానికల్ విభాగంలో 60, టెక్స్‌టైల్ విభాగంలో 60, కంప్యూటర్, కమర్షియల్ ప్రాక్టీస్ విభాగంలో 60 సీట్లు మొత్తం 420 సీట్లు ఉన్నాయి. ఆయా కోర్సుల్లో పాలిసెట్ ద్వారా అర్హత పొందిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తుంటారు.

**అందరి సహకారంతోనే ఎన్‌బీఏ గుర్తింపు**

కళాశాలకు అందరి సహకారంతోనే ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. ఉత్తమ బోధన, ఫలితాలు, విద్యార్థుల ప్రవేశాలు, మౌలిక సదుపాయాలు, ఇక్కడ నిర్వహించే అన్ని కార్యక్రమాలు ఇతర కళాశాలల కంటే ఉత్తమంగా ఉండటంతో ఎన్‌బీఏ గుర్తింపు వచ్చింది. అనేక అంశాలపై కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నాం. తక్కువ ఖర్చుతో తెలంగాణలోనే అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందడానికి, స్వయం ఉపాధికి అవకాశం ఉంది. ఇంటర్ ద్వారా ఇంజినీరింగ్ చేసిన విద్యార్థుల కంటే పాలిటెక్నిక్ ద్వారా ఇంజినీరింగ్ చేసిన వారిలో ప్రాక్టికల్స్ పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఎక్కువగా ఉండటంతో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉండటానికి అవకాశం ఉంటుంది.బి.రాజగోపాల్, ప్రిన్సిపల్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అగ్రహారం

# ఔత్సాహికులకు ప్రోత్సాహం




హనుమకొండ : ఉన్నత విద్య అభ్యసించి పారిశ్రామిక రంగంలో రాణించాలనుకునే యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా చేయూతనిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వారికి ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ప్రవేశ పెట్టారు. దీని ద్వారా సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు అవకాశం కల్పిస్తూ.. బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు చేసి యువతకు తోడ్పాటు అందిస్తున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ, ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్, ఖాదీ గ్రామీణ పరిశ్రమల మండలి సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. జిల్లాలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమల శాఖకు 248 దరఖాస్తులు రాగా, అందులో 156 దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. వీటిలో 64 మందికి రుణాలు మంజూరుకాగా, రూ.1.44కోట్లు రాయితీ అందింది. 2022-23లో 462 దరఖాస్తులను పరిశీలించి 373 దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. వాటిలో ఇప్పటి వరకు 102 మందికి రుణాలు మంజూరయ్యాయి. వీరికి రూ3.79 కోట్లు రాయితీ అందింది. ఈ రెండేళ్లలో బ్యాంకుల నుంచి మొత్తం 166 మందికి రుణాలు అందాయి. ప్రభుత్వం నుంచి రాయితీ కింద రూ.5.23 కోట్లు వచ్చింది. వ్యవసాయం, సేవలు, మినరల్ వాటర్, నిర్మాణరంగ ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు ఆదరణ బాగుందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసుకుంటే ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. తీసుకున్న రుణాన్ని మూడు నుంచి ఏడేళ్లలోపు చెల్లించవచ్చు. ఈ పథకంపై పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

**కావాల్సిన అర్హతలు**

18 నుంచి 60 ఏళ్లలోపు ఉండాలి.

కనీస విద్యార్హత 8వ తరగతి.

ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి.

పారిశ్రామిక రంగానికి రూ.10 లక్షలు, సేవా రంగానికి రూ.5 లక్షలు.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీ, దివ్యాంగులు, మహిళలు 5 శాతం, జనరల్ అభ్యర్థులు 10 శాతం తొలుత పెట్టుబడి వ్యయంగా చెల్లించాల్సి ఉంటుంది.

గ్రామీణ ప్రాంతాల్లో జనరల్ అభ్యర్థులకు 25 శాతం, పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులకు గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం, పట్టణ ప్రాంతంలో 25 శాతం రాయితీ అందజేస్తారు.

**లక్ష్యానికి మించి రుణాలిస్తున్నాం- హరిప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్**

ఏటా నిర్దేశించిన లక్ష్యానికంటే అదనంగా రుణాలు అందజేస్తున్నాం. బ్యాంకులను సమన్వయం చేసి సమస్యలుంటే పరిష్కరిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను పారిశ్రామిక రంగం వైపు ప్రోత్సహించేందుకే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హత కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలి. నిర్మాణ రంగానికి అధిక ప్రాధాన్యత ఉన్నందున ఆ రంగం దిశగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటే ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుంది.

# తాగునీటి పథకాల విస్తరణకు అమృత్

కరీంనగర్ :ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 పురపాలకలు, రెండు నగర పాలికలు ఉండగా అమృత్ 2.0 పథకం కింద 15 మున్సిపాలిటీలకు ప్రాధాన్యమిచ్చి తాగునీటి సరఫరా పథకాలను విస్తరించేలా చర్యలు చేపట్టారు. వీటి పరిధిలో సమీప గ్రామాలను విలీనం చేయడం, కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడంతో తాగునీటి వసతి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆయా పుర, నగర పాలికలు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించడంతో ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు పరిపాలన మంజూరు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా, 15వ ఆర్థిక సంఘం నిధులు, మున్సిపాలిటీ వాటాతో నిధులు రానున్నాయి. పరిపాలన అనుమతి లభించడంతో ప్యాకేజీల వారీగా టెండర్లు పిలిచే అవకాశముంది.

**పొంతన లేకుండా నీటి సరఫరా**

ప్రస్తుతం మున్సిపాలిటీల్లో, విలీన కాలనీల్లో రూరల్ మిషన్ భగీరథ పథకం కింద తాగునీరు సరఫరా చేస్తుండగా అదీ ఏ మూలకు సరిపోవడం లేదు. పైగా ఏ సమయంలో వస్తుందో తెలియని గందరగోళం ఉంది. జనాభా, నీటి అవసరాలకు అనుగుణంగా డిజైన్లు లేకపోవడమే ప్రధాన లోపంగా మారింది. కరీంనగర్‌లోని విలీన కాలనీల్లో అయితే రూరల్ మిషన్ భగీరథ పనుల కారణంగా తాగునీటి వ్యవస్థ దారుణంగా మారింది. గంటల తరబడి ట్యాంకులు నిండుతుండగా సమయపాలన లేకుండా పోయింది. నగర పాలికనే



స్వయంగా ప్రధాన పైపులైను విస్తరించి తాగునీటి వసతి కల్పించే పరిస్థితి ఏర్పడింది.

**తీరనున్న దాహం**

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, విలీన కాలనీల్లో తాగునీటి అవసరాలు తీర్చడానికి నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాయి. పంచాయతీల సమయంలో ఏవిధంగా సరఫరా చేస్తున్నారో అలాగే శుద్ధి నీరు పంపిణీ చేస్తుండగా కొత్త పురపాలికలు, విలీన కాలనీల ప్రజలు ఎండాకాలంలో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో పైపులైన్ల విస్తరణ, రిజర్వాయర్లు లేకపోవడం, జనాభా ప్రాతిపదికన, భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా నీటి సామర్థ్యం పెంచకపోవడమే సమస్యగా మారింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నిధులు విడుదల చేసేందుకు ముందుకు రావడంతో ఆయా పట్టణవాసులకు ఊరట కలగనుంది.

**రెండో ప్యాకేజీలో రూ.516.45 కోట్లు**

అమృత్ పథకంలో తాగునీటి సరఫరా మెరుగు పర్చేందుకు 15 మున్సిపాలిటీలను రెండో ప్యాకేజీలో చేర్చారు. ఈ ప్యాకేజీలో రూ.516.45 కోట్లు కేటాయించారు. ఈ నిధుల్లో పురపాలికల వాటా మొత్తం రూ.52.15 కోట్లు జోడించాల్సి ఉంటుంది. భవిష్యత్తు జనాభాను పరిగణనలోకి తీసుకొని పైపులైన్లు విస్తరించడం, రిజర్వాయర్లు నిర్మించేందుకు ఈ నిధులు ఉపయోగించుకోవాలని ప్రజారోగ్యశాఖ చర్యలు చేపట్టింది. కరీంనగర్‌లోని ఐదు ప్రాంతాల్లో ఫీడర్ పైపులైను 17.7 కిలోమీటర్లు, పంపిణీ పైపులైను 261 కి.మీ, రిజర్వాయర్లు 14, పెద్దపల్లి జిల్లాలో పంపిణీ పైపులైను 73 కి.మీ, జగిత్యాల జిల్లాలో 16.1 కి.మీ, పంపిణీ పైపులైను 106కిమీ, 7 రిజర్వాయర్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల, వేములవాడల్లో పంపిణీ లైను 129.11 కిమీ, రిజర్వాయర్లు 5 నిర్మించేందుకు ప్రణాళికలు చేసినట్లు సమాచారం.

# సింగరేణి.. 'జల'సిరులవేణి



హనుమకొండ : బొగ్గు వెలికితీతలో భాగంగా భూగర్భంలో వందల మీటర్ల లోతులో ఉన్న పాతాళ గంగను సింగరేణి పైకి తీసుకొస్తోంది. పదుల సంఖ్యలో కుంటలు, చెరువులను నీటితో నింపుతోంది. ఆ నీటితో బీడు భూములను సస్యశ్యామలం చేస్తూ రైతులకు సిరుల పంట పండిస్తోంది. జీవనోపాధి పొందడానికి చేయూతనిస్తోంది. ప్రకృతి పరవశించేలా, పశుపక్ష్యాదులు పర్యటించేలా జల సిరులను ఒడిసిపడుతూ కుంటలకు జలకళ తెస్తోంది. ఫలితంగా సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతాల్లోని బోర్లలో, చేదబావుల్లో పదుల మీటర్ల లోతులోనే నీరు లభించడం విశేషం.

వృథా చేయకుండా..జాతీయ సంపదైన బొగ్గును భూ గర్భం నుంచి వెలికితీయడం సింగరేణి కర్తవ్యం.. ఈ క్రమంలో గనుల్లో ఊటల ద్వారా ఉత్పన్నమవుతున్న నీటిని భారీ మోటార్లతో తోడుతూ గని ఉపరితలంలో ఎక్కడో ఒకచోట వదలడంతో ఆ నీరు వృథాగా పోయేది. ఈ నీరు ఎందుకు ఇలా కావాలి..? నీటి బొట్టును సంరక్షించి.. వ్యవసాయానికి అందించాలనే సంకల్పంతో సింగరేణి యాజమాన్యం దాదాపు దశాబ్దకాలంగా జల సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ వందలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తోంది.

**పచ్చని పంట పొలాలు**

దశాబ్దం క్రితం వర్షాధారంతో అరకొరగా పంటలు పండించిన కర్షకులు.. కాలం కోసం ఎదురుచూడకుండా పంటలు పండించేందుకు పుష్కలమైన జలాన్ని సింగరేణి అందిస్తోంది. భూగర్భ, ఉపరితల గనుల నుంచి రోజుకు వందల గ్యాలన్ల నీటిని బయటకు తోడుతుండటంతో ఈ నీటిని రైతులు సాగుకు మళ్లించుకుంటున్నారు. ఫలితంగా సింగరేణి ఏరియాల్లో ప్రధానంగా ప్రభావిత గ్రామాల్లోని బీడు భూములు సస్యశ్యామలమై వరి దిగుబడి పెరిగింది. ఏరియాలోని కేటీకే 1వ గని, కేటీకే ఉపరితల గని-2, కేటీకే యైటింక్లైన్ గనుల నుంచి వచ్చే నీటితో సెగ్గంపల్లి, గడ్డిగానిపల్లి, బస్వరాజుపల్లి శివార్లలో దాదాపు 316 ఎకరాల భూముల వరకు రెండు పంటలు సాగులోకి వచ్చాయి.

**కాల్వ ద్వారా పంపుతున్నాం..- బళ్లారి శ్రీనివాసరావు, సింగరేణి జీఎం**

బొగ్గు గనుల నుంచి తోడుతున్న నీటిని వృథా చేయకూడదనేది కంపెనీ ఆలోచన. అందుకు బావుల ద్వారా వచ్చే జలాన్ని కాల్వలు, చిన్న కుంటల ద్వారా పంట పొలాలకు అందిస్తున్నాం. వర్షాకాల, యాసంగి పంటలు పండుతున్నాయి. ఇతర పంటలకు కూడా నీరు అందుతోంది. ప్రభావిత ప్రాంతవాసులకు వనరులు ఎంతో దోహదపడుతున్నాయి.

# అంగన్‌వాడీ గుడ్లపై ప్రత్యేక ముద్ర

జనగామ : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేయాల్సిన కోడి గుడ్లు పక్కదారి పడుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం దీన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. జూన్ నుంచి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్ల పంపిణీ ప్రక్రియలో వినూత్న మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇందులో భాగంగా ప్రతి గుడ్డుపై ప్రత్యేక ముద్ర వేసి అందిస్తారు. దీంతో ఈ గుడ్లు ఎక్కడ కనిపించినా అధికారులు గుర్తించే అవకాశం ఉంటుంది.

**ఇప్పటి వరకు ఇలా..**

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతల వివరాలను ఇప్పటికే నమోదు చేశారు. వాటి ఆధారంగా వీరికి గుడ్లు సరఫరా చేస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయసున్న పిల్లలకు నెలకు 16.. గర్భిణులు, బాలింతలకు రోజుకొకటి చొప్పున గుడ్లను అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పాఠశాలలోనే ఉడికించి పెడుతున్నారు. వివిధ కారణాలతో కొందరు మహిళలు స్థానికంగా లేకపోయినా.. వారికి గుడ్లు అందజేసినట్లుగా రికార్డుల్లో రాసుకొని కొందరు సిబ్బంది దారి మళ్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

**ఇక నుంచి..**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే గుడ్లపై 'అంగన్‌వాడీ గుడ్లు... తెలంగాణ ప్రభుత్వం' అని ముద్రవేసి, సంబంధిత జోన్ నెంబర్‌ను కూడా పేర్కొంటారు. గుడ్లు పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టనున్నారు. జులై నుంచి ఫిబ్రవరి వరకు రెగ్యులర్ నెలల కాలంలో నెలకు రెండు తడవలుగా గుడ్లు అందిస్తారు. మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో గుడ్లు త్వరగా చెడిపోయే ప్రమాదం ఉండడంతో నెలకు మూడు తడవల్లో సరఫరా చేస్తారు. వేసవిలో అందించే మొదటి బ్యాచ్ గుడ్లపై నీలం రంగులో, రెండో బ్యాచ్ గుడ్లపై ఎరుపు రంగు,




మూడో బ్యాచ్ గుడ్లపై ఆకుపచ్చ రంగులో ముద్రవేసి పంపిణీ చేస్తారు. సాధారణ కాలంలో మొదటి వారంలో అందించే గుడ్లపై నీలం రంగు, రెండో విడతలో ఎరుపు రంగు ముద్ర వేస్తారు. మధ్యలో పేర్కొనే జోన్ నెంబరు స్పష్టంగా కనిపించేలా 5 మి.మి. పొడవు, వెడల్పులతో ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది.

**అక్రమాలకు అడ్డుకట్ట**

ప్రభుత్వ ముద్ర ఉన్న గుడ్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు, ఇతరులు భయపడతారు. పొరపాటున అధికారులో, ప్రజలో వీటిని గుర్తిస్తే అవమానంతో పాటు, శిక్షలు తీవ్రంగా ఉంటాయని కొనుగోలు చేయడానికి జంకుతారు. దీంతో అక్రమ రవాణా, వినియోగాన్ని ప్రాథమిక దశలోనే కట్టడి చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ గుడ్లను కమోడిటీ సప్లయ్ ట్రాకింగ్ సిస్టం ద్వారా బ్యాచుల వారీగా సరఫరా చేయనున్నారు.

# రాయితీ యంత్రం.. అందని వైనం

జగిత్యాల : వ్యవసాయంలో కూలీల కొరత తీవ్రమవుతుండగా సాగుకు సాయంగా నిలిచే ఆధునిక యంత్రాలను రాయితీపై ఇవ్వకపోవటంతో రైతులకు దన్ను కలగటంలేదు. జూన్ 1 నుంచి వానాకాలం సాగు పనులు చేపట్టనుండటం, 2022-23 ఆర్థిక సంవత్సరానికి యంత్ర లక్ష్మి పథకానికి రూ.1,500 కోట్ల నిధులను కేటాయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనటంతో రాయితీ యంత్రాలపై రైతులు ఆశగా ఉన్నారు.బయట కొనాల్సిందే..

జగిత్యాల జిల్లాలో వానాకాలంలో 4.43 లక్షల ఎకరాల్లో ఆహార, ఉద్యానపంటలు సాగుచేస్తారు. మరో 43 వేల ఎకరాల్లో పండ్లతోటలున్నాయి. ప్రస్తుతం సాగుకు 3,520 ట్రాక్టర్లు, 1,810 రోటోవేటర్లు, 4 ప్యాడీ త్రెషర్స్, 209 హార్వెస్టర్లు, 79 మినీ ట్రాక్టర్లు, 95 పవర్ టిల్లర్లను రైతులు వినియోగిస్తున్నారు. ప్రతి సీజన్‌లోనూ కనీసం 50-100 వరకు ట్రాక్టర్లను రైతులు కొనుగోలు చేస్తారు. గతంలో వీటన్నింటిపై రాయితీ ఉండేది. కాగా యంత్రాలు, పరికరాలు, పనిముట్లు, ట్రాక్టర్ల రాయితీని నిలిపివేయటంతో రైతులే పూర్తిధరకు బయటి మార్కెట్లో కొనాల్సివస్తోంది. దీంతో రైతులపై ఆర్థికభారంతో పాటుగా నాణ్యమైన పరికరాలు, యంత్రాలు లభించటంలేదని రైతులు వాపోతున్నారు. ఇటీవల మందుల పిచికారీకి డ్రోన్లను వినియోగిస్తున్నారు. హార్వెస్టర్లు, మినీట్రాక్టర్లు, పవర్‌టిల్లర్ల వినియోగం కూడా పెరగగా బోదెలు చేయటం, పసుపు ఉడికించి పాలిషింగ్, పత్తిలో దౌరకొట్టడం, మొక్కజొన్నలను ఒలవటం, ఇతర పంటల నూర్పిడి, మామిడిలో సస్యరక్షణ మందుల పిచికారీ, నేలలను చదును చేయటం, గట్టుచేయటం తదితరాలన్నీ యంత్రాలు, పరికరాల సాయంతోనే చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో యంత్రాలతో పాటు టార్పాలిన్‌షీట్లు, పంపుసెట్లు, పిచికారి యంత్రాలు, సీడ్‌డ్రిల్, నీటిపైపులు, బిందు, తుంపర సేద్య పరికరాలు, పాలీహౌజులు. సోలార్ ఫెన్సింగ్, పత్తితీత యంత్రాలు, మామిడి కాయలను తెంపే పరికరాలు, కొడవళ్లు, గడ్డి కత్తిరించే యంత్రాలు, ఇతరత్రా ఎద్దులతో నడిపే పరికరాల రాయితీని పునరుద్ధరించాలి.తొమ్మిదేళ్లుగా..రెండు సీజన్లలో కలిపి జిల్లాకు కనీసం రూ.75 కోట్ల వరకు నిధులను ఆర్‌కేవీవై, యంత్రలక్ష్మి, ఉద్యానశాఖ పథకాల ద్వారా ఇవ్వాల్సి ఉన్నా తొమ్మిది సీజన్లుగా నిధులను విడుదల చేయటంలేదు. కల్టివేటర్, రోటోవేటర్, ఫ్లవ్‌లతో నేలను దున్నటం, దమ్ముచేయటం, సరుకుల రవాణా తదితరాలకు ట్రాక్టర్ల వినియోగం తప్పనిసరిగా మారింది. చాలా గ్రామాల్లో దుక్కిటెడ్ల స్థానంలో ట్రాక్టర్లు చేరాయి.

# వసూళ్లకు సహకారం!

కరీంనగర్ : క్రమబద్ధీకరణకు వేచి చూస్తున్న ఒప్పంద సిబ్బంది అవసరాన్ని అవకాశంగా మలచుకున్నారు. నిబంధనలకు అనుగుణంగా అర్హులైనా డబ్బులు ఇవ్వాల్సిందే అని అందినకాడికి దండుకున్నారు.. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పని చేస్తున్న వారి నుంచి వసూళ్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా ఆరా తీస్తున్నారు.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పని తీరు, సంస్థ బలోపేతానికి వారి కృషి వివరాలు కోరగా గతేడాది డిసెంబరులోనే సహకార శాఖ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. వారిని ఇటీవల క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ నివేదిక పంపించడానికి ప్రతి ఉద్యోగి నుంచి రూ.5 వేల చొప్పున వసూలు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నివేదిక తయారీ సమయంలోనే ఆ శాఖ ఉద్యోగులు సంబంధిత ఒప్పంద సిబ్బందికి తమ నివేదికనే ప్రామాణికం అని స్పష్టం చేసి డబ్బులు ఇవ్వాల్సిందే అని పేర్కొన్నట్లు తెలుస్తోంది. చాలా మంది అప్పుడే వారి కోరిన మొత్తం ఇవ్వగా.. కొన్ని లోసుగులు ఉన్నవారు ఎక్కువ మొత్తంలో ఇచ్చినట్లు సమాచారం. కొంతమంది మాత్రం తరువాత ఇస్తామనడంతో అప్పటికి ఊరుకున్న వసూలు బృందం క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయిన వచ్చే నెల నుంచి పూర్తిస్థాయి వేతనాలు రానుండటంతో ఇటీవల ఒత్తిడి పెంచగా వారు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జీవోలో పేర్కొన్న నిబంధనలకు విరుద్ధంగానూ ఇద్దరు ముగ్గురిని క్రమబద్ధీకరించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వసూళ్ల విషయం రాష్ట్రస్థాయి అధికారులకు ఇటీవలే తెలియడంతో ఆరా తీసినట్లు సమాచారం. రాష్ట్రస్థాయి నుంచి వచ్చిన ఓ అధికారి ఇటీవల కొన్ని సంఘాల పరిధిలోని సిబ్బందిని విచారించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ మొత్తం వ్యవహారంలో వసూళ్ల పర్వానికి తెరతీసిన సహకార శాఖ ఉద్యోగులు చాకచక్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. తమ పేరెక్కడా బయట పడకుండా కింది స్థాయి సిబ్బందితో వసూళ్లు చేయించినట్లు సమాచారం.



# పోరాటం ఉద్ధృతం చేసిన అంగన్వాడీలు

అమరావతి : ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆంధ్రప్రదేశ్‌లో అంగన్వాడీలు పోరాటాన్ని ఉద్ధృతం చేశారు. ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమంతో ఆందోళనలను హోరెత్తించారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇతర అంగన్వాడీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే వరకూ సమ్మెను విరమించబోమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గిరిధర్‌రావు కార్యాలయం ఎదుట బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ ప్రభుత్వం చర్చల పేరుతో అంగన్వాడీల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఆర్థికేతర సమస్యలను పరిష్కరించామని.. సమ్మె విరమంచాలని మంత్రులు చెప్పడం సరికాదన్నారు. ఆర్థిక పరమైన విషయాలను పరిష్కరిస్తేనే తాము సమ్మె విరమిస్తామని.. అప్పటి వరకూ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్థానికంగా ఎమ్మెల్యే అందుబాటులో లేరని కార్యాలయ సిబ్బంది తెలిపినా.. ఆయన వచ్చేంత వరకూ వేచి ఉంటామని అంగన్వాడీలు అక్కడే బైఠాయించారు. ఈ నిరసనల్లో సీఐయూటీ నగర కార్యదర్శి శ్రీనివాసరావు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇంటిని అంగన్వాడీ కార్యకర్తలు ముట్టడించారు. ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించి నినాదాలు చేశారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఇంటి ముట్టడికి యత్నించిన అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు, అంగన్వాడీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

# వైసీపీ ఇన్చార్జుల మార్పుపై కొనసాగుతోన్న సీఎం జగన్ కసరత్తు



అమరావతి: రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో వైసీపీ ఇన్చార్జుల మార్పుపై సీఎం జగన్ కసరత్తు కొనసాగుతోంది.

బుధవారం మరికొందరి మంత్రులు, ప్రజా ప్రతినిధులకు సీఎంవో నుంచి పిలుపు వచ్చింది. దీంతో విశాఖ జిల్లా చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధనరెడ్డి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబురావు, ఎంపీ ఆదాల ప్రభాకర రెడ్డి, పెనుగొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శంకర నారాయణ, కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి, శ్రీకాకుళం జిల్లా రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఎమ్మెల్యేలు, మంత్రులతో సమావేశమై సీట్ల మార్పులపై సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి చర్చిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాల మార్పులపై ముందుగా వారు చర్చలు జరుపుతున్నారు. నేతల అభిప్రాయాలు తెలుసుకుని పలు నియోజకవర్గ ఇన్చార్జులను సీఎం జగన్ ఖరారు చేయనున్నారు. కసరత్తు అనంతరం రెండు రోజుల్లో మార్చిన ఇన్చార్జులతో రెండో జాబితాను వైసీపీ అధిష్ఠానం విడుదల చేసే అవకాశముంది. మరోవైపు అభ్యర్థులను మార్చిన సెగ్మెంట్లలో సమన్వయం కోసం వైసీపీ కసరత్తు చేస్తోంది. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయి ముందుకు ప్రకాశం జిల్లా నేతలు మంత్రి మేరుగ, బాలినేని, మాగుంట, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ, సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబు, కొండెపి నియోజకవర్గ నేతలు హాజరయ్యారు. ప్రకాశం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో హైకమాండ్ మార్పులు చేసింది. కొండెపి నియోజకవర్గ ఇన్చార్జ్ అశోక్ బాబు స్థానంలో మంత్రి సురేష్‌కు బాధ్యతలు అప్పగించింది. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్ బాబుకు అవకాశం ఇవ్వలేదు. ఈ మార్పులపై పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్ తగాదాలు పక్కన పెట్టి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని విజయసాయి రెడ్డి నేతలకు సూచనలు చేశారు.

# భిన్నాభిప్రాయాలు వినిపిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది: నిమ్మగడ్డ రమేశ కుమార్



విశాఖపట్నం: కొత్తగా విడుదలయ్యే జాబితాలో ఓటు లేకపోతే మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ సూచించారు. విశాఖపట్నంలో బుధవారం సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ త్రిసభ్య కమిటీతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మగడ్డ మాట్లాడుతూ.. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై అసహనం వ్యక్తం చేశారు.

“5వ తేదీ కొత్త ఓటరు లిస్టు విడుదలవుతుంది. అందులో ఓటు లేకపోతే.. తిరిగి ఓటు నమోదు చేసుకోవాలి. బహుశా మార్చి.. ఏప్రిల్‌లో ఎన్నికలు రావొచ్చు. ఓటు కేవలం హక్కే కాదు.. ప్రాథమిక హక్కు కూడా. అకారణంగా ఓటు తొలగిస్తే.. తొలగించిన అధికారి శిక్షకు అర్హులు. ఓటు హక్కు విషయంలో ఇబ్బందులుంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలి. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది. వ్యక్తుల స్వేచ్ఛ హరించకూడదు” అని నిమ్మగడ్డ అన్నారు. మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# జనసేన కండువా కప్పుకున్న వైసీపీ ఎమ్మెల్సీ



అమరావతి: వైసీపీ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ జనసేనలో చేరారు. బుధవారం జనసేనాని పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా వంశీ కృష్ణ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ.. “వైసీపీలో చేరకముందే నేను పవన్ కళ్యాణ్ ను అభిమానిని. పవన్ ఆలోచనలు నచ్చి నేడు జనసేనలో చేరాను. నేను నా సొంత పార్టీలోకి వచ్చాననే ఆనందం ఉంది. గతంలో ప్రజారాజ్యం లో నేను పని చేశాను. యువరాజ్యం అధ్యక్షుడిగా పవన్ కళ్యాణ్‌తో నాడు తిరిగాను. పవన్ కళ్యాణ్ అంటే అభిమానం నేటికీ ఉంది. నేను వైసీపీకి రాజీనామా చేసి, జనసేనలో చేరాను. గతంలో వైసీపీ అభివృద్ధి కోసం నేను కష్టపడ్డాను. ఇప్పుడు జనసేన కోసం అదే డెడికేషన్‌తో పని చేస్తాను. అందరినీ కలుపుకుని ముందుకు సాగుతాను. కొన్ని శక్తులు, కొన్ని కారణాల వల్ల వైసీపీని వీడుతున్నాను. నాకు ధైర్యంగా ఉంటూ నాతో నడిచి వస్తున్న వారందరికీ నా కృతజ్ఞతలు. ఇంకా చాలా మంది జనసేనతో కలిసి నడిచేందుకు సిద్ధంగా ఉన్నారు. త్వరలోనే వారంతా అధికారికంగా పార్టీలోకి వస్తారు. పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలనేది చాలా మంది ఆకాంక్ష. ఆ కోరిక నెరవేరేలా అందరం కలిసి పని చేస్తాం. నాకు ఈ అవకాశం ఇచ్చిన పవన్ కళ్యాణ్‌తో కలిసి నడుస్తాను. తప్పకుండా జనసేనకు అద్భుతమైన ప్రజాదరణను అందరూ చూస్తారు” అని వంశీ కృష్ణ పేర్కొన్నారు. జనసేన నేత నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ సమక్షంలో వంశీ ఈరోజు జనసేనలో జాయిన్ అయ్యారని తెలిపారు. సమాజానికి ఉపయోగపడే విధంగా కింది స్థాయి నుంచి ఎమ్మెల్సీ స్థాయికి వంశీకృష్ణ ఎదిగారన్నారు. మూడు నెలల నుంచి స్థానిక సమస్యలు, ప్రజా సమస్యలపై స్పందించలేకపోతున్నామనే ఆవేదన ఉందన్నారు. పవన్ కళ్యాణ్‌తో కలిసి పని చేయాలనే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. జనసేనలో చేరేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారన్నారు. విశాఖలో వైసీపీ కోసం వంశీకృష్ణ అహర్నిశలు పని చేశారని.. ఏడు సార్లు నగర అధ్యక్షుడిగా ఉన్న వంశీకృష్ణ జనసేనలోకి రావడాన్ని స్వాగతిస్తున్నామని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# నాలుగున్నరేళ్లగా ఆంధ్రప్రదేశ్ ప్రజలతో జగన్ ఆటలు..




విశాఖ: టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వంగలపూడి అనిత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బుధవారం ఆమె విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. ‘నేను ఉన్నాను, నేను విన్నాను’ అని చెప్పి ఎన్నికలో గెలిచిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను సీఎం మోసం చేశారని, ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ‘ఆడుదాం ఆంధ్ర అనే ప్రోగ్రాం’ పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాలుగున్నరేళ్ళగా ఆంధ్రప్రదేశ్ ప్రజలతో సీఎం జగన్ ఆటలు ఆడుకుంటున్నారని, ఆశావర్కర్స్, మున్సిపాలిటీ, అంగన్వాడీ ఉద్యోగులు.. ఇలా అందరితో ముఖ్యమంత్రి ఆడుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వకుండా.. మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని అనిత అన్నారు. క్యాసినో కొడాలి నాని, బెట్టింగ్ అనిల్ కుమార్ వైసీపీలో ఉన్నారని, పేకాట ఆడే వైసీపీ నాయకులను జగన్ తయారు చేశారని మండిపడ్డారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో రూ. 100 కోట్లు ఖర్చు పెడుతున్నారని... ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసం చేస్తున్నారని, ఆడుదాం ఆంధ్రా కాకుండా దోచుకొంద్రా ఆంధ్ర అనే పెడితే సీఎంకు, వైసీపీ పార్టీకి సరిపోతుందన్నారు. డబ్బులను దోచుకోవడానికే అదుదాం ఆంధ్ర ప్రోగ్రాం చేస్తున్నారని విమర్శించారు. జగన్ ఎన్ని రకాలుగా ఆంధ్రప్రదేశ్ ప్రజలతో ఆడుకోవాలో అన్ని రకాలుగా ఆడుకుంటున్నారని.. ఇప్పుడు ప్రజలు జగన్, వైసీపీతో ఆడుకునే సమయం వచ్చిందని.. ఇక సీఎం జగన్ ఆటలు చెల్లవని వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు.




# భీకర యుద్ధాలు.. విపత్తులు మిగిల్చిన విషాదం

సరికొత్త ఆశలు, ఆశయాలతో నూతన సంవత్సరంలో అడుగుపెట్టేందుకు యావత్ ప్రపంచం సిద్ధమవుతోంది. ఈ క్రమంలో గడిచిన ఏడాది కాలాన్ని ఓసారి తిరిగి చూస్తే.. ప్రకృతి విపత్తులు , భీకర యుద్ధాలు పలు దేశాలను వణికించాయి. వీటితోపాటు పలు ప్రాంతాల్లో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అరెస్టు, భారత్-కెనడా మధ్య దౌత్య సంబంధాలు బీటలువారడం వంటి పరిణామాలకు 2023 సాక్ష్యంగా నిలిచింది.

**తుర్కియే విషాదం :** తుర్కియేతోపాటు సిరియాలో చోటుచేసుకున్న భూకంపం కనీవినీ ఎరుగని విషాదాన్ని మిగిల్చింది. ఫిబ్రవరి 6న 7. 8, 7.7 తీవ్రతలతో కంపించిన భూమి.. రెండు దేశాల్లో దాదాపు 67వేల మందిని పొట్టనబెట్టుకుంది. లక్షల మంది తీవ్రగాయాలపాలయ్యారు. లక్షలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. 1939 తర్వాత తుర్కియే చవిచూసిన అతిపెద్ద భూకంప విలయం ఇదే. ఆ దేశంలో సుమారు 59వేల మంది చనిపోగా.. సిరియాలో ఎనిమిది వేల మంది మృత్యువాతపడ్డారు.

**టైటాన్ సబ్‌మెరైన్ :** అట్లాంటిక్ మహాసముద్రంలో సుమారు 12 వేల అడుగుల లోతులో ఉన్న టైటానిక్ నౌక శకలాలను చూసేందుకు వెళ్లి గల్లంతైన టైటాన్ మినీ జలాంతర్గామి కథ విషాదాంతమైంది. నీటి ఒత్తిడికి టైటాన్ పేలిపోవడంతో ఓషన్‌గేట్ వ్యవస్థాపకుడు స్టాక్టన్ రష్ సహా అందులో వెళ్లిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

వీరు బయలుదేరిన మూడో రోజుకు ఈ మినీ జలాంతర్గామి శకలాలను టైటానిక్ ఓడకు 500 మీటర్ల దూరంలో అమెరికా కోస్ట్ గార్డ్ రెస్క్యూ బృందాలు గుర్తించాయి.

**‘పిట్ట’ పోయి ‘ఎక్స్’ వచ్చే..** మైక్రో బ్లాగింగ్ వేదిక ‘ట్విటర్’ను కొనుగోలు చేసిన ఎలాన్ మస్క్.. అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 2022లో 44 బిలియన్ డాలర్లతో ట్విటర్‌ను మస్క్ కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ‘ట్విటర్’పేరును ‘ఎక్స్’గా మారుస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. జులై 2023 నుంచి ట్విటర్ లోగో స్థానంలో ‘ఎక్స్’ను చేర్చారు. సంస్థలో అనేక మంది ఉద్యోగులను తొలగించడంతోపాటు బ్లూటిక్ సబ్‌స్క్రిప్షన్‌కు రుసుం వసూలు వంటి మార్పులు చేశారు.

**ఇమ్రాన్ జైలుకు.. నవాజ్ పాకిస్థాన్‌కు:** పాకిస్థాన్ రాజకీయాల్లో 2022తోపాటు 2023లోనూ కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. అంతకుముందు ఏడాది అవిశ్వాస తీర్మానంతో ప్రధాన మంత్రి పదవి కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్.. ఈ ఏడాది జైలుకు వెళ్లాల్సి వచ్చింది. తోషాఖానా అవినీతి కేసులో ఆయన్ను దోషిగా తేల్చిన ఇస్లామాబాద్‌లోని సెషన్స్ కోర్టు.. మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇదే సమయంలో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ పాకిస్థాన్‌లో అడుగుపెట్టారు. నాలుగేళ్లుగా లండన్‌లో తలదాచుకున్న ఆయన.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**జనాభాలో చైనాను దాటి..** ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ అవతరించింది. ఇదివరకు ఈ జాబితాలో చైనా మొదటి స్థానంలో ఉండగా.. 2023లో భారత్ దాన్ని అధిగమించింది. ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ నివేదిక ప్రకారం 142.86 కోట్లతో భారత్ తొలిస్థానానికి చేరుకోగా.. 142.57 కోట్ల జనాభాతో చైనా రెండోస్థానంలో నిలిచింది. భారత్ మొత్తం జనాభాలో 68 శాతం మంది 15-64 ఏళ్ల మధ్య ఉన్న వారే.

**గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం..** హమాస్ ఉగ్రవాదులు అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి చేయడం.. పశ్చిమాసియాలో భీకర యుద్ధానికి దారితీసింది. అనంతరం ఇజ్రాయెల్ మొదలుపెట్టిన ప్రతిదాడులతో పాలస్తీనా ప్రాంతమంతా ఛిద్రమవుతోంది. హమాస్ దాడుల్లో 1200 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోగా.. గాజాలో ఇప్పటివరకు 20 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 23 లక్షల గాజా పౌరులు నిరాశ్రయులయ్యారు. హమాస్ ఉగ్రవాదులను అంతం చేసేవరకు తమ పోరు ఆగదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు.

**ఆధిపత్య పోరుతో రక్తసిక్తం..** అంతర్యుద్ధం, సైనిక తిరుగుబాటుతో సూడాన్ వణికిపోతోంది. అధికారంపై పట్టు కోసం సైన్యం, పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్‌ల మధ్య కొనసాగుతున్న పోరుతో దేశం రక్తసిక్తంగా మారింది. ఇరువర్గాల మధ్య కాల్పుల విరమణ అమలు కాకపోవడంతో విమానాశ్రయాలే రణక్షేత్రాలుగా మారాయి. ఈ క్రమంలో ఖార్టూమ్ ఎయిర్‌పోర్టులోని పలు విమానాలు దగ్ధమయ్యాయి. సుదీర్ఘకాలం పాలించిన ఒమర్-అల్-బషీర్‌ను అధికారం నుంచి తొలగించిన తర్వాత అక్కడ అంతర్యుద్ధం మొదలయ్యింది. ఈ నేపథ్యంలో సూడాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ‘ఆపరేషన్ కావేరీ’ని చేపట్టింది. ఈ మిషన్ ద్వారా దాదాపు 4వేల మందిని సురక్షితంగా తీసుకువచ్చింది.

**భారత్- కెనడా సంబంధాలు..** కెనడాలో ఖలిస్థానీ మద్దతుదారుల దుశ్చర్యలు పెచ్చుమీరాయి. ఈ క్రమంలోనే ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హతమయ్యాడు. అతడి మరణానికి భారత్‌తో సంబంధముందంటూ కెనడా చేసిన ఆరోపణలు.. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపాయి. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలపై భారత్ కూడా దీటుగా స్పందించింది. ఇదే సమయంలో అమెరికాలోని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ భారత్‌కు హెచ్చరికలు చేస్తూనే ఉన్నాడు.

**రెండో ఏడాది.. రష్యా యుద్ధం..** ఉక్రెయిన్‌పై రష్యా మొదలుపెట్టిన యుద్ధం రెండో ఏడాదీ కొనసాగుతోంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం ఇప్పటి వరకు 10 వేల మంది ఉక్రెయిన్ పౌరులు మృతి చెందినట్లు అంచనా. మరోవైపు ఉక్రెయిన్, రష్యాలకు చెందిన ఐదు లక్షల మంది సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. తమ లక్ష్యం చేరే వరకూ యుద్ధం ఆపే ప్రసక్తే లేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ తెగేసి చెబుతుండటంతో దాని ముగింపు ఎప్పుడు ఉంటుందనే దానిపై స్పష్టత లేదు.




# ఐదుగురు అమలాపురం వాసుల మృతి

టెక్సాస్ : అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. టెక్సాస్ హైవేలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురం వాసులు. మృతుల్లో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ బంధువులు ఉన్నారు. వీరిని పొన్నాడ సతీష్ చిన్నాన్న నాగేశ్వరరావు కుటుంబసభ్యులుగా గుర్తించారు. పొన్నాడ నాగేశ్వరరావు, ఆయన భార్య సీతామహాలక్ష్మి, కుమార్తె నవీన గంగ, మనవడు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. నాగేశ్వరరావు అల్లుడు లోకేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి.

# సంక్రాంతి తర్వాత జిల్లాలకు నారా లోకేష్..



అమరావతి: సంక్రాంతి తర్వాత జిల్లాలకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వెళ్లనున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో భేటీ కానున్నారు. 40 రోజులు పాటు పర్యటన ఉండే విధంగా కార్యాచరణ రూపొందించుకున్నారు.

పాదయాత్ర ద్వారా ఇప్పటికే 97 అసెంబ్లీ నియోజకవర్గాలను నారా లోకేష్ సందర్శించారు. ఈసారి చేపట్టబోయే పర్యటనలో మిగిలిన 78 నియోజకవర్గాల్లో తిరగాలని నిర్ణయించుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధానంగా పోల్ మేనేజ్మెంట్‌పై దృష్టి పెట్టారు. బూత్ లెవెల్ నుంచి మండల స్థాయి, అనుబంధ సంస్థల కమిటీలతో సాంస్థాగత వ్యవహారా లపై సమీక్ష నిర్వహించనున్నారు. 11 నెలల గ్రామం అనంతరం సొంత నియోజకవర్గమైన మంగళగిరిలో తన పర్యటనను నారా లోకేష్ ప్రారంభించారు. ఏ పార్టీకి చెందని తటస్థుల ఇళ్లకు వెళ్లి వారిని కలుస్తున్నారు.

# బాబును ప్రజలు ఫుట్‌బాల్ ఆడుతారు: మంత్రి రోజా

తిరుపతి: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఆడ పులులు క్రీడల్లో దూసుకుపోతున్నారని మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆమె బుధవారం శ్రీపద్మావతి మహిళ యూనివర్సిటీలో ఇంటర్ స్టేట్ యూనివర్సిటి ఉమెన్స్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఏపీలో ‘ఆడుదాం ఆంధ్రా’ నిన్నటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. శ్రీపద్మావతి మహిళ యూనివర్సిటీకు వస్తే తన పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తుందని అన్నారు. చంద్రబాబు నాయుడుకు 175 సీట్లకు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఉందని విమర్శించారు. రాష్ట్రం పరిస్థితి దేవుడు ఎరుగు.. కుప్పం నియోజకవర్గం అయినా కాపాడుకోవాలని బాబు పర్యటనకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. 14 ఏళ్లు సీఎంగా, 40 ఏళ్లుగా కుప్పం ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. కుప్పం మున్సిపాలిటీ, కుప్పం రెవెన్యూ డివిజన్‌లో వేల పెన్షన్లు, ఇళ్లు, సంక్షేమ పథకాలను ఇచ్చింది సీఎం జగన్ అని తెలిపారు. 2024లో చంద్రబాబును కుప్పంలో ప్రజలు ఫుట్‌బాల్ ఆడుతారని మంత్రి రోజా అన్నారు. ఏపీని అభివృద్ధి చేసి సీఎం జగన్ మోహన్రెడ్డి చూపిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నుంచి బయటకు వెళ్తే సూసైడ్ చేసుకున్నట్లేనని ఆమె తెలిపారు. పదవులే పరమావధిగా ఉన్నవాళ్లకు పార్టీలు మారితే భవిష్యత్ ఉండదని మంత్రి రోజా అన్నారు.

# కేంద్రం ఇచ్చిన డబ్బును బటన్ నొక్కి జగన్ పంచుతున్నారు



రాజమండ్రి: కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు అంటించుకుంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. రాజమండ్రిలో మెడికల్ కాలేజీ, ఈఎస్ఐ హాస్పిటల్, మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మిస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. కేంద్రం జలజీవన్ మిషన్ కింద 6000 కుళాయి కనెక్షన్లు ఇచ్చిందన్నారు. టూరిజం అబివృద్ధి కోసం రాజమండ్రి నుంచి లంబసింగి హైవే వేస్తున్నామన్నారు. కేంద్రం ఇచ్చిన డబ్బులను జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి పంచుతున్నారని పురందేశ్వరి పేర్కొన్నారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వాన్నమైన స్థితిలో ఉందన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో మడ అడవులను ధ్వంసం చేస్తున్నారని పురందేశ్వరి తెలిపారు. ప్రభుత్వం విధ్వంసంతో ప్రారంభమై అవినీతిలో కూరుకుపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వాలు పేర్లు మార్చవద్దని కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. కేంద్ర నాయకత్వం ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తానని ఆమె పేర్కొన్నారు. వైసీపీ పాలనలో ఏపీ అవినీతిమయంగా మారిందని పురందేశ్వరి పేర్కొన్నారు.

# మరీ ఇంత అందంగా ఉంటే ఎట్లా రాధిక

మెహబూబా సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నేహా శెట్టి. మొదటి సినిమా నిరాశ పరిచినా కూడా సందీప్ కిషన్ తో కలిసి గల్లీ రౌడీ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. ఆ తర్వాత అఖిల్ అక్కినేని హీరోగా నటించిన మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ సినిమాలో కీలక పాత్రలో కనిపించింది. మొటి మూడు సినిమాలు కూడా నిరాశ పరిచిన కూడా అదృష్టం కొద్ది డీజే టిల్లు సినిమాతో ఈ అమ్మడికి సూపర్ హిట్ దక్కింది. ఆ సినిమాలో ఈమె పోషించిన రాధిక పాత్ర ను ఇప్పటికి జనాలు తలుచుకుంటూ



ఉన్నారు అంటే ఆ పాత్ర ఎంతగా హిట్ అయిందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో అంతకు మించిన జోరును కనబర్చుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు అందమైన ఔట్ ఫిట్ లో చాలా అందంగా కనిపిస్తూ కుర్రకారుకు మత్తెక్కిస్తోంది.

అన్ని వర్గాల వారిని ఈ అమ్మడు అలరిస్తూ ఉంది. సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలు వీడియోలు బోల్డ్ నెస్ లో శృతి మించకుండా, ఒక మోస్తరు అన్నట్లుగా ఉంటూనే చాలా అందంగా రాధిక అలియాస్ నేహా శెట్టి కనిపిస్తోంది. ఈ రేంజ్ లో అందంగా సింపుల్ గా కనిపించడం కేవలం ఈ అమ్మడికే సాధ్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# తమన్నాకి వాటిపై అంత మోజెందుకు.. ఇన్నేళ్లకు బయటపడ్డ సీక్రెట్..!

దాదాపు 18 ఏళ్లుగా సౌత్ సినీ ఆడియన్స్ ని అలరిస్తూ స్టార్ ఫాం కొనసాగిస్తున్న భామ మిల్కీ బ్యూటీ తమన్నా. 2005లో శ్రీ సినిమాతో తెరంగేట్రం చేసిన అమ్మడు తనకు వచ్చిన ప్రతి అవకాశాన్ని చేస్తూ వచ్చింది. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరితో నటించిన తమన్నా కెరీర్ మొదలు పెట్టి 18 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ అదే క్రేజ్ తో సినిమాలు చేస్తుంది. కెరీర్ పీక్స్ లో ఉన్న టైం లో సినిమాకు భారీ రెమ్యునరేషన్ అందుకున్న తమన్నా ప్రతి అవకాశాన్ని సద్వినియోగపరచుకుంది. హీరోయిన్ గా 18 ఏళ్ల లాంగ్ కెరీర్ లో తమన్నా 16 మిలియన్ల ఆస్తులను సంపాదించుకుంది. అంటే మన కరెన్సీ లో చెప్పాలంటే దాదాపు 132 కోట్లు అన్నమాట. ఏడాదికి 12 కోట్ల దాకా రెమ్యునరేషన్ అందుకుంటున్న తమన్నా సినిమాలతో పాటుగా వాణిజ్య ప్రకటనల్లో కూడా నటిస్తుంది. ప్రకటనల కోసం



తమన్నా 4 నుంచి 5 కోట్ల దాకా తీసుకుంటుందని తెలుస్తుంది. సినిమాల్లో హీరోయిన్ గానే కాదు స్పెషల్ సాంగ్స్ తో కూడా తమన్నా సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. అలా స్పెషల్ సాంగ్ కోసం తమన్నా 60 నుంచి కోటి దాకా చార్జ్ చేస్తుందని తెలుస్తుంది. 2018 ఐపీఎల్ స్టార్టింగ్ ఈవెంట్ లో 10 మినిట్స్ పాట కోసం 50 లక్షల పారితోషికం అందుకుంది తమన్నా. ఫాంటా, మొబైల్ ప్రీమియర్ లీగ్, సెల్కాన్ మొబైల్స్, చంద్రిక లాంటి బ్రాండ్స్ కి తమన్నా బ్రాండ్ అంబాసిడర్ గా చేస్తుంది. తమన్నా ముంబైలోని 16.6 కోట్ల విలువైన జుహు అపార్ట్ మెంట్ లో నివసిస్తుంది. తమన్నాకు కార్లపై చెప్పలేనంత ఇష్టం ఉందట. అందుకే ఆమె దగ్గర 3, 4 మోడల్ కార్లు ఉంటాయి. ల్యాండ్ రోవర్ డిస్కవరీ స్పోర్ట్స్, బి.ఎం.డబల్యు 320I, మెర్సిడెస్ బెంజ్ జి.ఎల్.ఈ, మిట్సుబిషి పజెరో స్పోర్ట్ వంటి మోడల్ కార్లు తమన్నా దగ్గర ఉన్నాయి. ఇదే కాదు తమన్నా వార్డ్ రోబ్ లో 3 లక్షల విలువైన హై ఎండ్ ఛానల్ హ్యాండ్ బ్యాగ్ ఉంది. తమన్నా వైట్ %ుు% గోల్డ్ అనే స్టోర్ ను బోల్డ్ బిజినెస్ కూడా స్టార్ట్ చేసింది. తమన్న దూకుడు చూస్తుంటే మరో ఐదేళ్లు ఇదే ఫాం కొనసాగించేలా ఉంది. సీనియర్ హీరోయిన్స్ అంతా కూడా ప్రయోగాలు చేస్తున్న టైం లో తమన్నా కూడా అలాంటి ప్రయోగాలు చేయాలని చూస్తుంది.




# సంక్రాంతి పోరు.. మీటింగ్ పెట్టినా సెటిలవ్వలే



సంక్రాంతికి రెండు పెద్ద సినిమాలు అలాగే ఒక మీడియం రేంజ్ సినిమా మరో చిన్న సినిమా ఇలా వస్తే పర్వాలేదు కానీ ఒకేసారి అన్ని మంచి బజ్ ఉన్న సినిమాలు వచ్చినా కూడా పెద్ద సమస్య వచ్చి పడుతుంది. తప్పకుండా అన్ని సినిమాలపై కలెక్షన్స్ ప్రభావం చూపించే అవకాశం అయితే ఉంటుంది. ఇక 2024 సంక్రాంతికి పోటీ మాత్రం చాలా ఆసక్తిని రేపుతోంది. గుంటూరు కారం సినిమా నిర్మాతలు అయితే ఎప్పుడో క్లారిటీ ఇచ్చారు. అలాగే హనుమాన్ సినిమా కూడా 5 నెలల ముందే సంక్రాంతి ఫిక్స్ అని తేల్చేశారు. అసలైతే ఈ సినిమా ను ఈ ఏడాది మధ్యలోనే విడుదల చేయాలి. కానీ సంక్రాంతి అయితేనే రిలీజ్ కు పర్ఫెక్ట్ అని నిర్మాతలు రిస్క్ చేసి మరి ఇంతకాలం ఆగారు. ఇక ఇదే బాటలో సంక్రాంతికి మా కంటెంట్ బాగా సెట్ అవుతుంది అని నమ్మకంతో ఈగల్ సినిమాతో పాటు నా సామిరంగా, సైంధవ సినిమాలు సిద్ధమయ్యాయి అయితే ఈ తరహా క్లాష్ అంత మంచిది కాదు అని కూర్చొని మాట్లాడుకుంటే చాలా బెటర్ అని నిర్మాత దిల్ రాజు సమక్షంలో ఒక సమావేశాన్ని ఏర్పాటు అయితే చేశారు. అయితే ఆ సమావేశంలో గుంటూరు కారం నిర్మాత నాగ వంశీ ఈగల్ నిర్మాత విశ్వప్రసాద్ అలాగే నా సామిరంగా నిర్మాత శ్రీనివాస్ మాత్రమే హాజరయ్యారు. హనుమాన్ నిర్మాత నిరంజన్ రెడ్డి మాత్రం హాజరు కాలేదు. ఆయన మాత్రం సంక్రాంతి సీజన్ ను ఎట్టి పరిస్థితులను మిస్ చేసుకోకూడదు అనే ఆలోచనలో ఉన్నారు. తమ సినిమాను ఎప్పుడో సంక్రాంతికి విడుదల చేయబోతు న్నట్లు చెప్పామని అప్పుడే బిజినెస్ టీమ్స్ కూడా క్లోజ్ అయ్యాయి.. ఇప్పుడు సినిమాను వాయిదా వేస్తే చాలా ఇబ్బంది అవుతుంది అని నిర్మాత చాలా పట్టుదలతో కనిపిస్తూ ఉన్నాడు. ఈ సీజన్లో అయితే గుంటూరు కారం మహేష్ సినిమా కాబట్టి అది వెనక్కి తగ్గే అవకాశం అయితే లేదు. మరోవైపు సురేష్ బాబు సపోర్టుతో సైంధవ సినిమా సంక్రాంతికి బలమైన ప్రణాళికను సిద్ధం చేసుకుంది. కాబట్టి ఈ రెండు సినిమాల విషయంలో అయితే పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. ఇక హనుమాన్ నిర్మాత అయితే సమావేశానికి కూడా హాజరు కాలేదంటే ఆయన వెనక్కి తగ్గే అవకాశం లేదని తెలుస్తోంది. ఇక మిగిలిన సినిమాలు నా సామి రంగ, ఈగల్ రెండు సినిమాలపైనే అనుమానాలు ఉన్నప్పటికీ వాళ్లు కూడా సంక్రాంతి పై చాలా పట్టుదలతో ఉన్నారు. ఇక మొదటి నిర్మాతల సమావేశం అయితే ఫెయిల్ అవడంతో దిల్ రాజు మరో వారం తరువాత మరోసారి అందరితో చర్చించాలని డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది. మరి అప్పుడు ఎవరు వెనక్కి తగ్గుతారో చూడాలి.

# స్టార్ హీరో నటవారసురాలు బరిలోకి?



బాలీవుడ్ లో వరుసగా నటవారసులు తెరకు పరిచయం అవుతున్నారు. ఇటీవలే ది ఆర్చీస్ సిరీస్ తో కింగ్ ఖాన్ షారూఖ్ నటవారసురాలు సుహానా ఖాన్, అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నందా వెండితెరకు పరిచయం అయ్యారు. ఇంతలోనే ఇప్పుడు అజయ్ దేవగన్- కాజోల్ దంపతుల నటవారసురాలు నైసా దేవగన్ బాలీవుడ్ ఆరంగేట్రం గురించి హిందీ మీడియాలో ఆసక్తికర చర్చ సాగుతోంది. సెలబ్రిటీ పార్టీల్లో నిరంతర చర్చల్లో నిలుస్తున్న నైసా బరిలోకి వచ్చేస్తోందని యూత్ లోను ముచ్చట సాగుతోంది. కానీ ఇప్పుడు వారి ఊహకు భిన్నమైన సమాధానం దేవగన్ నుంచి వచ్చింది. కరణ్ చాట్ షో కాఫీ విత్ కరణ్ 8 తాజా ఎపిసోడ్‌లో చిరకాల స్నేహితులు అజయ్ దేవగన్ -రోహిత్ శెట్టి ప్రత్యక్షమయ్యారు. అజయ్, రోహిత్‌లు దాదాపు 33 ఏళ్లుగా స్నేహితులు. ఇప్పుడు వారు తమ పిల్లలు తమ బాలీవుడ్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం గురించి మాట్లాడారు. అయితే నైసా ఆరంగేట్రం గురించి దేవగన్ షాకిచ్చే విషయం చెప్పారు. తన కూతురు నైసాకు ఇప్పట్లో సినిమా రంగంలోకి వచ్చే ఆలోచన లేదని అజయ్ దేవగన్ అన్నారు. ప్రస్తుతం ఆమె నట ప్రపంచంలోకి రావాలని కోరుకోవడం లేదు. ఆమె అలా ఉండాలని నేను అనుకోను.. కానీ రేపు ఏదైనా మారితే చూద్దాం అని అజయ్ దేవగన్ అన్నారు. ప్రస్తుతం సున్నా శాతం అవకాశం మాత్రమే ఉంది అని దేవగన్ చెప్పాడు. అయితే తన కొడుకు ఇషాన్ సినిమాల్లో నటించాలనే తపనతో ఉన్నాడని రోహిత్ శెట్టి వెల్లడించాడు. అతడు మాట్లాడుతూ, నా కుమారుడు సినిమాల్లో నటుడిగా ఉండాలనుకుంటున్నాడు. అతడు నటనపై మక్కువ ఏర్పరచుకున్నాడు. అయితే వాడు మొత్తం ఫార్మాట్‌లో వెళ్ళాలి. సినీరంగంలో పోరాటాన్ని ఎదుర్కొని చివరిగా నా కార్యాలయానికి చేరుకోవాలి అని శెట్టి అన్నారు. అయితే రోహిత్ శెట్టి, అతని కొడుకు, అతడి భార్య ఎందుకు ప్రైవేట్‌గా ఉంటారు? అని కరణ్ ప్రశ్నించారు. ప్రజలు వారిని ఎందుకు చూడలేదు అని ప్రశ్నించగా, శెట్టి ఇలా అన్నాడు, మంచి విషయాలు దాచిపెట్టాలి మేము అలాగే ఉన్నాము. నా జీవితంలో ఎప్పుడూ పార్టీ పెట్టలేదు. నేను చాలా అరుదుగా పార్టీలకు వెళ్తాను అని అన్నారు. అజయ్ దేవగన్ మాట్లాడుతూ మనం చాలా నిరాడంబరమైన నేపథ్యాల నుండి వచ్చి చిన్న స్థాయి నుండి ప్రారంభించినప్పుడు కుటుంబ విలువలు ఎల్లప్పుడూ అలాగే ఉంటాయి. నేటికీ మనం ఎవరైనప్పటికీ మధ్యతరగతి వాళ్లమే. ఇంట్లో మేం పూర్తిగా మధ్యతరగతి వాళ్లం. మా నమ్మకాలు, ప్రతిదీ మధ్యతరగతి తరహాలోనే ఉంటాయి అన్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అజయ్ దేవగన్ త్వరలో రోహిత్ శెట్టి సింగం ఎగైన్ లో కనిపించనున్నాడు. కాప్-చిత్రంలో అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్‌లను అతిథి పాత్రల్లో నటిస్తారు. కరీనా కపూర్ ఖాన్ అవ్నీ పాత్రలో మళ్లీ నటించనుంది. దీపికా పదుకొణె, టైగర్ ష్రాఫ్ కూడా ఈ సినిమాలో పోలీసులుగా పరిచయం కానున్నారు.

# నటి సురేఖ వాణి వీడియో వైరల్

టాలీవుడ్ లో స్టార్ హీరోలకు హీరోయిన్స్ కు అమ్మగా, అక్కగా, అత్తగా నటించి తనదైన గుర్తింపు దక్కించుకున్న నటి సురేఖ వాణి. చిన్న వయసులోనే వయసుకు మించిన పాత్రల్లో నటించిన సురేఖ వాణి హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా అందంగా ఉంటారు అనడంలో సందేహం లేదు. సినిమాల్లో కాస్త డీ గ్లామర్ గా కనిపించినా కూడా సోషల్ మీడియాలో ఆమె ఒరిజినల్ అందంను చూడవచ్చు. కూతురు తో పోటీ పడి మరీ అందంగా సురేఖ వాణి కనిపిస్తూ ఉంటారు. ఈ మధ్య కాలంలో ఈమె సినిమాలు కాస్త తగ్గినా కూడా సోషల్ మీడియాలో సందడి కొనసాగుతూనే ఉంది. తాజాగా మరోసారి సోషల్ మీడియా ద్వారా సురేఖ వాణి తన అందంతో అందరిని సర్ ప్రైజ్ చేశారు. సాధారణంగా చీర కట్టు లో



సురేఖ వాణి చాలా అందంగా ఉంటారు అనే అభిప్రాయం ఉంది. అలాంటిది లైట్ పింక్ కలర్ చీర లో సురేఖ వాణి సన్నగా నాజూకుగా కనిపిస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. సురేఖ వాణి ఫోటోలు వైరల్ అయినట్లుగా, తాజాగా ఆమె చీర కట్టులో ఫోటోలకు ఫోజు ఇస్తున్న వీడియో వైరల్ అవుతోంది. ఆ మధ్య సురేఖ వాణి కూతురు సుప్రీత సినిమాల్లో ఎంట్రీ ఇవ్వబోతున్నట్లుగా ప్రచారం జరిగింది.

ఇప్పుడు అందుకు సంబంధించి ఎలాంటి అప్డేట్ లేదు. సురేఖ వాణికి ఉన్న క్రేజ్ మరియు మంచి పేరు నేపథ్యంలో సుప్రిత కి టాలీవుడ్ లో గ్రాండ్ వెల్ కమ్ దక్కే అవకాశాలు ఉన్నాయి. మరి సుప్రిత ఆ దిశగా ప్రయత్నాలు చేస్తుందా, సురేఖ తన కూతురును హీరోయిన్ గా పరిచయం చేయాలి అనుకుంటున్నారా అనే విషయాలపై క్లారిటీ రావాల్సి ఉంది.

# కావ్య థాపర్ సొగసు చూడతరమా?

'ఏక్ మినీ కథ' చిత్రంతో కావ్యా థాపర్ పేరు టాలీవుడ్ లో మార్మోగింది. ప్రయోగాత్మక కంటెంట్ ఉన్న సినిమాలో కావ్య నటనకు ప్రాధాన్యమున్న పాత్రతో మెప్పించింది. కావ్య అందచందాలు ప్రతిభకు యువతరం ఫిదా అయింది. అలాగే బాలీవుడ్ లో రాజ్ అండ్ డీకే రూపొందించిన 'ఫర్జీ'లో నటించి పాన్ ఇండియాలో గుర్తింపు దక్కించుకుంది. కావ్య థాపర్ సోషల్ మీడియాల్లోను స్పీడ్ గా ఉంది. లేటెస్ట్ ఫోటోషూట్లను ఇన్ స్టా వేదికగా షేర్ చేస్తోంది. తాజాగా కావ్య షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. ఈ భామ ఫ్లోరల్ డిజైనర్ టాప్ లో ఎంతో అందంగా కనిపిస్తున్న ఫోటోని షేర్ చేసింది. ఈ బ్యూటీ స్టన్నింగ్ లుక్ అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. ఉత్తరాదికి చెందిన కావ్య థాపర్ నటి కం మోడల్. తెలుగు- తమిళం- హిందీ చిత్రాలలో నటిస్తోంది. థాపర్ 1995



ఆగస్టు 20న మహారాష్ట్రలో జన్మించింది. ఆమె తన పాఠశాల జీవితాన్ని బాంబే స్కాటిష్ స్కూల్- పోవై నుండి పూర్తి చేసింది.

పాఠశాల జీవితం పూర్తయిన తర్వాత ఆమె ఠాకూర్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్ లో చేరింది. వినోద రంగంలో థాపర్ రంగ ప్రవేశం అనూహ్యం. తత్కాల్ అనే హిందీ లఘు చిత్రంలో నటించిన ఈ బ్యూటీ పతంజలి- మేక్ మై ట్రిప్ - కోహినూర్ వంటి ప్రకటనలలో కూడా కనిపించింది. కావ్య నటించిన తెలుగు సినిమా ఈ మాయ పేరేమిటో 2018లో విడుదలైంది. ఈ చిత్రం ఆమె మొదటి తెలుగు చిత్రం. 2019లో తమిళ చిత్రం మార్కెట్ రాజా ఎంబిబిఎస్ విడుదలైంది. ఈ చిత్రం ఆమె మొదటి తమిళ చిత్రం. సందీప్ కిషన్ 'ఊరు పేరు భైరవకోన'లో, 'బిచ్చగాడు' ఫేం విజయ్ ఆంథోనీ సరసన 'పిచైక్కారన్ 2'లోను కావ్య థాపర్ నటించింది.



# ఇక భారత్ రైస్.. కిలో రూ.25కే..?

దిల్లీ: దేశంలో ఆహార పదార్థాలను సామాన్యులకు అందుబాటు ధరల్లో అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 'భారత్' బ్రాండ్ పేరుతో పప్పు, గోధుమ పిండిని విక్రయిస్తోన్న విషయం తెలిసిందే. ఇక నుంచి బియ్యాన్ని కూడా డిస్కౌంట్ ధరకు విక్రయించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే 'భారత్ రైస్' పేరుతో కిలో బియ్యాన్ని రూ.25కే విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా రిటైల్ స్టోర్లలో సగటున కిలో బియ్యం ధర క్రితం ఏడాదితో పోలిస్తే 14.1శాతం పెరిగింది. దీంతో అందుబాటు ధరలో బియ్యాన్ని అందించేందుకు కేంద్రం.. 'భారత్ రైస్'ను తీసుకురానున్నట్లు సమాచారం. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్, మొబైల్ వ్యాన్ల ద్వారా రాయితీ ధరకు బియ్యం విక్రయాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్ బ్రాండ్ కింద రూ.60కే కిలో శనగపప్పు, రూ.27.50కే కిలో గోధుమ పిండిని విక్రయిస్తోన్న విషయం తెలిసిందే. నేషనల్ కో ఆపరేటివ్ కన్జ్యూమర్ ఫెడరేషన్, నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా దేశంలోని 2వేల రిటైల్ పాయింట్లలో వీటిని విక్రయిస్తున్నారు. వీటిలాగే 'భారత్ రైస్' విక్రయాలు కూడా చేపట్టనున్నట్లు సమాచారం. అయితే, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా.. దేశంలో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు ఇటీవల కేంద్రం పలు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. బాస్మతియేతర రకాల ఎగుమతులపై నిషేధం విధించింది. అటు బాస్మతి బియ్యంపైనా ఆంక్షలు అమల్లోకి తెచ్చింది. టన్ను ధర 1200 డాలర్లకంటే తక్కువ ధర ఉన్న బాస్మతి బియ్యం ఎగుమతులను నిషేధించింది.



# ఇజ్రాయెల్ ఎంబసీ సమీపంలో పేలుడు.. సీసీటీవీ కెమెరాకు చిక్కిన అనుమానితులు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం సమీపంలో పేలుడుకు సంబంధించి కీలక ఆధారాలను దర్యాప్తు బృందాలు సేకరించాయి. ఇప్పటికే ఇద్దరు అనుమానితులను సీసీటీవీ కెమెరా దృశ్యాల ఆధారంగా గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు మొదలుపెట్టారు. మంగళవారం సాయంత్రం దేశ రాజధానిలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం సమీపంలో జరిగిన పేలుడు కలకలం రేపుతోంది. ఈ ఘటనలో సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఇజ్రాయెల్ రాయబారిని దుర్భాషలాడుతూ రాసిన లేఖను గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు దిల్లీ పోలీసులు, ఎన్ఐఏ బృందం రంగంలోకి దిగారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఇతర సంస్థల వద్ద భద్రతను పెంచారు.

**అప్రమత్తంగా ఉండండి: ఇజ్రాయెల్ :** తమ రాయబార కార్యాలయం సమీపంలో పేలుడుపై ఇజ్రాయెల్ జాతీయ భద్రతా మండలి స్పందించింది. దీనిని ఉగ్రదాడిగా అనుమానించింది. ఈ ఘటన నేపథ్యంలో భారత్‌లోని తమ పౌరుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. జాగ్రత్తగా ఉండాలంటూ పౌరులకు సూచనలు చేసింది. మార్కెట్లు, షాపింగ్ మాల్స్ వంటి బహిరంగ ప్రదేశాలకు వెళ్లడం తగ్గించాలని సలహా ఇచ్చింది. అంతేకాకుండా, వారు ఇజ్రాయెల్ గుర్తులను ప్రదర్శించకుండా ఉండాలని కోరింది. సోషల్ మీడియాలో ప్రయాణ వివరాలు, ఫొటోలను అప్‌లోడ్ చేయొద్దని సూచించింది. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం సమీపంలో గతంలోనూ రెండు సార్లు దాడులు చోటు చేసుకున్నాయి. 2012లో ఎంబసీలోని ఇజ్రాయెల్ భద్రతా సిబ్బంది భార్య కారుపై బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఆమె గాయపడ్డారు. 2021లో ఎంబసీ వెలుపల పేలుడు సంభవించింది. నాడు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కొన్ని వాహనాలు దెబ్బతిన్నాయి.

# అధికారులు ఎట్టిపరిస్థితుల్లో దరఖాస్తులను తిరస్కరించకూడదు: మంత్రి ఉత్తమ్



కరీంనగర్: ఆరు గ్యారంటీలపై హామీ ఇచ్చి ఎన్నికలకు వెళ్లామని.. వాటిని ఎట్టి పరిస్థితుల్లో అమలు చేయాలన్న లక్ష్యంతోనే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులకు ప్రజాపాలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. "ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ పంచాయతీల్లో దరఖాస్తులు స్వీకరిస్తాం. కొత్త రేషన్ కార్డుల జారీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రేషన్ కార్డులు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులన్నీ స్వీకరించాలి.. ఎట్టి పరిస్థితుల్లో తిరస్కరించ వద్దు. లబ్ధిదారుల అర్హత అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన ప్రభుత్వం ఇది. వారి ఆశయాలకు అనుగుణంగా అధికారులు పని చేయాలి. ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఆరోగ్యశ్రీలో భాగంగా వైద్య ఖర్చులను రూ.10 లక్షలకు పెంచాం. మరో నాలుగు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. దరఖాస్తుల స్వీకరణ మొక్కుబడిగా కాకుండా అధికారుల్లోనూ మార్పు వచ్చిందని ప్రజలు భావించేలా ఉండాలి. దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా పోలీసులు ప్రజలతో ఫ్రెండ్లీగా వ్యవహరించాలి. స్వీకరణ ప్రక్రియలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే దళారులు తయారు అవుతారు. పదేళ్ల తర్వాత అవకాశం వచ్చిన దృష్ట్యా పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది" అని ఉత్తమ్ తెలిపారు.

# ప్రజాపాలన విజయవంతం చేయాలి.. కార్యకర్తలకు పొన్నం దిశానిర్దేశం



సిద్దిపేట: జిల్లాలోని హుస్నాబాద్‌లో ప్రజా పాలనపై నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు. 28 నుంచి జనవరి 6 వరకు జరిగే ప్రజా పాలన విజయవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రతీ కుటుంబానికి అందేలా దరఖాస్తు ఫారాలను ప్రభుత్వమే అందిస్తుందని చెప్పారు. అప్పులపై స్వేద పత్రం విడుదల చేసిన బీఆర్ఎస్ నాయకులు, ముందు కల్వకుంట్ల కుటుంబ ఆస్తులపై సౌధ పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షన్ దారులకు ప్రతీ నెల ఒకటవ తేదీ నుండి ఐదో తేదీలోపు జీతాలు అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# ఉత్తరాది నుంచి బలమైన గాలులు.. తెలంగాణలో చలి తీవ్రత అధికం



హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఉత్తరాది నుంచి తెలంగాణలోకి బలమైన గాలులు వీస్తున్నాయని, దీంతో రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరో రెండ్రోజుల పాటు చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయని, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉందని పేర్కొన్నారు. జనవరి ఒకటో తేదీ తర్వాత చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరో వైపు హైదరాబాద్ శివారులో చలిపులి పంజా విసురుతోంది. ఉదయం పూట బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. చలి తీవ్రత పెరగటంతో చిన్నారుల్లో నిమోనియా సహా పలు రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి గవదబిళ్లల సమస్యలతో చిన్నారులు భారీగా ఆసుపత్రుల్లో చేరుతున్నారని చెప్పారు.

# ఎన్నికల వివాదం వేళ.. రెజ్లర్లను కలిసిన రాహుల్ గాంధీ

చండీగఢ్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం ఉదయం రెజ్లర్లతో భేటీ అయ్యారు. ఆయనతో సమావేశమైన వారిలో ప్రముఖ రెజ్లర్ బజరంగ్ పునియా కూడా ఉన్నారు. హరియాణాలోని ఝజ్జర్ జిల్లాకు చెందిన వీరేందర్ అఖాడాలో వారి సమావేశం జరిగింది. క్రీడాకారులను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు, ఆ తర్వాత ఎన్నికల వ్యవహారంతో భారత రెజ్లింగ్ సమాఖ్య చుట్టూ వివాదాలు ముసురుకొన్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. దీనిపై పునియా మీడియాతో మాట్లాడారు. 'ఆయన మా రెజ్లింగ్ రొటీన్‌ను చూసేందుకు వచ్చారు. మాతో పాటు రెజ్లింగ్ కూడా చేశారు' అని తెలిపారు. ఇటీవల జరిగిన రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు, భాజపా ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్‌సింగ్ విజయం సాధించారు. ఇది రెజ్లర్లను తీవ్ర నిరాశకు గురిచేసింది. సంజయ్ ఎన్నికపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికే సాక్షి మలిక్ రిటైర్మెంట్ ప్రకటించగా.. బజరంగ్ పునియా, వీరేందర్ యాదవ్ పద్మశ్రీ అవార్డులను వాపస్ చేశారు. ఖేల్‌రత్న, అర్జున అవార్డులను వెనక్కి ఇచ్చేస్తున్నట్లు వినేశ్ ఫొగాట్ ప్రకటించారు. ఇదిలా ఉంటే.. కొత్తగా ఎన్నికైన సమాఖ్య పాలక మండలిపై కేంద్ర క్రీడా శాఖ వేటువేసిన సంగతి తెలిసిందే. అండర్-15, అండర్-20 జాతీయ రెజ్లింగ్ పోటీలను హడావుడిగా నిర్వహించేందుకు సిద్ధం కావడాన్ని తప్పుపడుతూ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో తాను రెజ్లింగ్ వ్యవహారాల నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు బ్రిజ్ భూషణ్ ప్రకటించారు. క్రీడారాజకీయాలకు దూరంగా ఉంటానని వెల్లడించారు.

# 2023 ఇయర్ ఎండింగ్ రాచకొండ క్రైమ్ రిపోర్ట్ ఇదే...



హైదరాబాద్: రాచకొండ కమిషనరేట్ పరిధిలో నేరాల సంఖ్య పెరిగాయని పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. 2023 సంవత్సరానికి సంబంధించి క్రైమ్ రిపోర్టును రాచకొండ సీపీ బుధవారం మీడియాకు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే 6.8% నేరాల సంఖ్య పెరిగిందన్నారు. గతేడాది 27664 కేసులు నమోదు అవగా.. ఈ ఏడాది 29166 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్ కేసులు 25 శాతం పెరిగాయన్నారు. చైన్ స్నాచింగ్, అత్యాచారం, సాధారణ దొంగతనాలు కేసులు తగ్గాయన్నారు. చిన్నారులపై లైంగిక దాడుల కేసులు, హత్యలు, కిడ్నాప్‌లు పెరిగాయన్నారు. అలాగే డ్రగ్స్ కేసులో 12 మందిపై పీడీ యాక్ట్ నమోదు అయ్యిందన్నారు. డ్రగ్స్ 282 కేసుల్లో 698 మంది అరెస్టు అయినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. మహిళపై నేరాలు 6.65 శాతం తగ్గాయన్నారు. మానవ అక్రమ రవాణా 58 కేసులో 163 మంది అరెస్ట్ అవగా.. ఆరుగురుపై పీడీ యాక్ట్ పెట్టినట్లు చెప్పారు. గేమింగ్ యాక్ట్‌పై 188 కేసులు నమోదు చేయగా వాటిలో 972 మందిని అరెస్ట్ చేశామన్నార్ను. ఏడాది నేరాల్లో 5241 కేసుల్లో శిక్షలు ఖరారు అయ్యాయని చెప్పారు. కన్విక్షన్ రేట్ 62 శాతం పెరిగిందన్నారు. 20 కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడిందన్నారు. సైబర్ నేరాల్లో 42 మంది అంతరాష్ట్ర, విదేశీ నిందితులను అరెస్ట్ చేశామని తెలిపారు. సైబర్ నేరాల్లో నిందితుల బ్యాంక్ ఖాతాలోని 89.92 లక్షలకు నగదును ఫ్రీజ్ చేసి బాధితులకు అప్పగించామన్నారు. ఆపరేషన్ స్మైల్ ద్వారా 64 మంది చిన్నారులను కాపాడామని.. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 136 మంది చిన్నారులను కాపాడినట్లు వెల్లడించారు. 21 బాల్య వివాహాలు నిలిపివేశామన్నారు. మెట్రో రైల్‌లలో 730 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. కమిషనరేట్ పరిధిలో 16594 కేసులు నమోదు చేశామని.. 2900 మంది డ్రైవింగ్ లైసెన్స్ రద్దు అయ్యాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు పెరిగాయన్నారు. ఈ ఏడాది 3321 ప్రమాదాలు జరగ్గా 633 మంది మృతి చెందారన్నారు. అలాగే 3205 మందికి గాయాలు అయ్యాయన్నారు. గత యేడాదితో పోలిస్తే 16 శాతం రోడ్డు ప్రమాద మరణాలు పెరిగాయన్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ద్వారా ఈ ఏడాది 56 కేసుల్లో 153 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. 71 మంది బాధితులకు విముక్తి కలిగించామని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన 8758 ఫిర్యాదులో 4643 పరిష్కరించామని సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

# బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడిపై లుక్ అవుట్ నోటీస్ జారీ




హైదరాబాద్: బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడిపై పోలీసులు లుక్ అవుట్ నోటీస్ జారీ చేశారు. సోహెల్ పంజాగుట్టలో రాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమయ్యాడు. అయితే ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు డ్రైవర్‌ను లొంగిపొమ్మని చెప్పాడు. తనకు బదులు డ్రైవర్ అబ్దుల్‌ను పోలీస్ స్టేషన్‌కు పంపించాడు. ప్రమాదం చేసి నేరుగా ముంబైకి వెళ్లిపోయిన సోహెల్.. అక్కడి నుంచి దుబాయ్‌కి పారిపోయాడు. ఈ క్రమంలో సోహెల్ కోసం పంజాగుట్ట పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. దుబాయ్‌లో ఉన్న సోహెల్‌ను రప్పించేందుకు పంజాగుట్ట పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు.

# మోత మోగాద్దు!



హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల్లో అతిగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. డీజే బాక్సులు, బాణసంచాకు అనుమతి లేదని..ఎవరైనా డీజేలు ఉపయోగించినా..బాణసంచా కాల్చినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈమేరకు రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు పబ్‌లు, బార్లు, రెస్టారెంట్స్, ఫామ్ హౌస్‌లు, వైన్ షాపులు, ఈవెంట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రజలందరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. ట్రాఫిక్, ఎస్ఓటీ, షీ టీమ్స్, పెట్రోలింగ్ వంటి పోలీసు బృందాలు వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు, నేరాలు జరగకుండా విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. ఔట్ డోర్ కార్యక్రమాలు జరిగే చోట డీజే బాక్సులకు అనుమతి లేదని, ఎటువంటి బాణసంచా కాల్చడానికి వీల్లేదని, పరిమితికి మించి ఈవెంట్ లోకి ప్రేక్షకులను అనుమతించకూడదని పేర్కొన్నారు. వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడానికి తమ బృందాలు తనిఖీలు చేస్తారని, నిషేధిత డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల మీద ఉక్కుపాదం మోపుతున్నామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. పబ్‌లు, బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయం లోపు మూసి వేయాలని, మైనర్ యువతకు మద్యం అమ్మే దుకాణాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోడ్ల మీద ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రంకెన్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వాహన యజమానుల మీద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్థరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా మరియు ఎటువంటి బైక్ రేసులు చేయకుండా ఉండేందుకు నిర్దేశిత సమయం పాటు తాత్కాలికంగా ఫ్లై ఓవర్ లను మూసివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ జానకి, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఎస్ఓటి డీసీపీ గిరిధర్, డీసీపీ అడ్మిన్ ఇందిర, ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కొవిడ్ అడ్వాన్స్ నిలిపివేత!

కొవిడ్ సమయంలో తీసుకొచ్చిన కొవిడ్ అడ్వాన్స్ సదుపాయాన్ని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ నిలిపివేసింది. కొవిడ్ వేళ ఉద్యోగులు తమ వైద్య, ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు ఈపీఎఫ్ఓ ఈ సదుపాయాన్ని తీసుకొచ్చింది. హెల్త్ ఎమర్జెన్సీ జాబితా నుంచి కొవిడ్-19ను ప్రపంచ ఆరోగ్య సంస్థ తప్పించిన నేపథ్యంలో ఈ సదుపాయాన్ని నిలిపివేస్తూ ఈపీఎఫ్ఓ ఈ నిర్ణయం తీసుకుంది. వారం క్రితం ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఈపీఎఫ్ఓ ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే వెలువడనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అంటే ఇకపై పీఎఫ్ చందాదారులు కొవిడ్ అడ్వాన్స్ పేరిట భవిష్య నిధి నుంచి సొమ్ములను ఉపసంహరించుకోవడం సాధ్యపడదు. ప్రస్తుతం ఉమాంగ్ యాప్‌లోకి వెళ్లి కొవిడ్ అడ్వాన్స్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే 'సర్వీసు అందుబాటులో లేదు' అనే సందేశం కనిపిస్తోంది. కొవిడ్ కాలంలో తీసుకొచ్చిన ఈ నాన్ రిఫండబుల్ అడ్వాన్స్ సదుపాయం చాలా మందికి ఉపకరించినా.. కొందరు మాత్రం వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నారు. ఈ సదుపాయాన్ని ఇన్నేళ్ల పాటు కొనసాగించడం వల్ల చాలామంది రిటైర్‌మెంట్ సేవింగ్స్‌పై ప్రభావం పడిందని నిపుణులు చెబుతున్నారు. 2020 మార్చి 28న తీసుకొచ్చిన కొవిడ్ అడ్వాన్స్ సదుపాయాన్ని 2.2 కోట్ల మంది వినియోగించుకున్నారు. రూ.48 వేల కోట్లు కొవిడ్ అడ్వాన్స్ రూపేణ ఉపసంహరించుకున్నారని ఈపీఎఫ్ వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com